http://www.agnidharanews.com

# అగ్నిధార

శుక్రవారం 5 సెప్టెంబర్ 2025

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



## సర్వం సిద్ధం..

- 30 వేల మంది పోలీసులతో బందోబస్తు
- భద్రత, రవాణా కోసం 160 గణేష్ యాక్షన్ టీమ్స్ ఏర్పాటు
- నిమజ్జనం కోసం 20 ప్రధాన చెరువులను, 72 కృత్రిమ కొలనులు ఏర్పాటు
- ఈ నెల 6న 50 వేల విగ్రహాలు నిమజ్జనానికి తరలి వస్తాయని అధికారుల అంచనా

హైదరాబాద్:

నగరంలో వినాయక నిమజ్జనానికి సర్వం సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. నగర వ్యాప్తంగా 303 కిలోమీటర్లు మేర గణేష్ శోభాయాత్రలు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. నిమజ్జనానికి సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. నగరంలో 13 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. 30 వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు వివరించారు. భద్రత, రవాణా కోసం 160 గణేష్ యాక్షన్ టీమ్స్ ఏర్పాటు చేయబడ్డాయని అధికారులు వెల్లడించారు. నిమజ్జనం కోసం 20 ప్రధాన చెరువులను, 72 కృత్రిమ కొలనులను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. 134 క్రేన్లు, 259 మొబైల్ క్రేన్లు నిమజ్జన స్థలాల్లో సిద్ధంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ప్రజల రక్షణ కోసం హుస్సేన్ సాగర్‌లో 9 బోట్లు కూడా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. 200 మంది గజ ఈతగాళ్లను చెరువులు, కొలనుల వద్ద ఉంచినట్లు వెల్లడించారు. శానిటేషన్ కోసం 14,486 మంది సిబ్బందిని తీసుకున్నామని అన్నారు. నిమజ్జన యాత్ర మార్గాల్లో 56,187 విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. ఈ నెల 6న 50 వేల విగ్రహాలు నిమజ్జనానికి తరలి వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, ఖైరతాబాద్ - మిగతా3లో

# అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండాలి

- శాఖల మధ్య సమన్వయంతోనే వరద నష్టాలను తగ్గించగలం
- ఎవరికి వారు ఉంటామంటే క్రైసిస్ మేనేజ్‌మెంట్ చేయలేం
- మరమ్మతులు, నిర్మాణాలు, తాత్కాలికం కాకుండా శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలి
- ఎరువుల పంపిణీలోనూ సమన్వయలోపం వల్లే సమస్యలు వస్తున్నాయి
- యూరియా పంపిణీలో ముందుగా రైతులకు టోకెన్లు ఇచ్చి గందరగోళం లేకుండా చూడాలి




కామారెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనలో భాగంగా.. అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద నష్టం ఎక్కువగా జరగకుండా అప్రమత్తమై, సరైన సమయంలో స్పందించి చర్యలు చేపట్టిన అధికారులను ఆయన అభినందించారు. పరిపాలనా సౌలభ్యం కోసం వివిధ శాఖలను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. క్రైసిస్ మేనేజ్మెంట్ సమయంలో శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు వివిధ శాఖలతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. సమస్య వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా మానవత్వంతో వ్యవహరించాలని ఆయన చెప్పుకొచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు పకడ్బందీగా అమలు చేయాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాబోయే 15 రోజుల్లో మరోసారి సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఇంచార్జ్ మంత్రి సీతక్క ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సమీక్షలో సీతక్క దృష్టికి తీసుకురావాలని సూచించారు. నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వం నుంచి రిలీఫ్ ఫండ్‌ను రాబట్టుకోవాలని చెప్పుకొచ్చారు. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత ప్రణాళికలు రూపొందించడానికి అధికారులు కృషి చేయాలని సీఎం వివరించారు. - మిగతా3లో

# అదేం సీక్రెట్ కాదు..



- మోదీతో కారులో సంభాషణపై పుతిన్ ఆసక్తికర వ్యాఖ్యలు
- అలాస్కాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన చర్చల గురించి మోదీకి వివరించాను
- ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించే అంశంపై ట్రంప్, పుతిన్‌లు ఇటీవల అలాస్కాలో సమావేశమయిన సంగతి తెలిసిందే
- ట్రంప్‌తో తన సంభాషణ బ్రోకెన్ ఇంగ్లీష్‌లోనే జరిగింది



## మీరు అంతర్గత కలహాలకు చెక్ పెడితే అధికారం మనదే

- కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయండి
- బీజేపీ నేతలకు అమిత్‌షా దిశానిర్దేశం
- కూటమి బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అమిత్‌షా రాష్ట్ర నాయకుల అభిప్రాయాలను తెలుసుకున్నట్లు సమాచారం

# తమకు బీఆర్ఎస్‌కు ఎలాంటి స్నేహం లేదు

- ఎంపీ డీకే అరుణపై మంత్రి వాకిటి శ్రీహరి ఫైర్..
- కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం కేసును సీబీఐకి అప్పగించిందని
- బీజేపీకి, బీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం ఉందో పార్లమెంట్ ఎన్నికల ఫలితాలలో బట్టబయలయ్యింది

మహబూబ్ నగర్

కాళేశ్వరం అవినీతిపై ఎంపీ డీకే అరుణ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర మత్స్య, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి ఖండించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం కేసును సీబీఐకి అప్పగించిందని తెలిపారు. డీకే అరుణ బీఆర్ఎస్‌ను కాపాడేందుకు సీబీఐకి అప్పగించారని ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తమకు బీఆర్ఎస్‌కు ఎలాంటి స్నేహం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు.. అయితే.. బీజేపీకి, బీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం ఉందో పార్లమెంట్ ఎన్నికల ఫలితాలలో బట్టబయలయ్యిందని మంత్రి వాకిటి శ్రీహరి ఆరోపించారు. - మిగతా3లో



# ఆచితూచి కవిత అడుగులు



- సాధారణంగా ఒక కీలక నాయకురాలిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే కచ్చితంగా పార్టీ అధ్యక్షుడు.. కార్యనిర్వాహక అధ్యక్షుడు సంతకం చేయాల్సి ఉంటుంది
- కానీ అవి లేకుండా సోమా భరత్ కుమార్, తక్కెళ్ళపల్లి రవీంద్రరావు సంతకాలు మాత్రమే అందులో ఉన్నాయి
- వారిద్దరు కూడా పార్టీకి కార్యదర్శులుగా ఉన్నారు
- తనను సస్పెండ్ చేస్తూ లేఖ విడుదల చేసిన భారత రాష్ట్ర సమితి పై కవిత ఆగ్రహం వ్యక్తం చేయొచ్చు
- ఇది చెల్లదంటూ పేర్కొనవచ్చు. కానీ అలాంటి పని కవిత చేయలేదు
- పైగా భారత రాష్ట్ర సమితి అధిష్టానం దారి తప్పినప్పటికీ.. తను మాత్రం పకడ్బందీ విధానాలతోనే బయటకు వచ్చారు.

హైదరాబాద్

హడావిడిగా కవితపై గులాబీ పార్టీ సస్పెన్షన్ వేటు విధించింది. సాధారణంగా ఒక కీలక నాయకురాలిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే కచ్చితంగా పార్టీ అధ్యక్షుడు.. కార్యనిర్వాహక అధ్యక్షుడు సంతకం చేయాల్సి ఉంటుంది. కానీ అవి లేకుండా సోమా భరత్ కుమార్, తక్కెళ్ళపల్లి రవీంద్రరావు సంతకాలు మాత్రమే అందులో ఉన్నాయి. వారిద్దరు కూడా పార్టీకి కార్యదర్శులుగా ఉన్నారు. తనను సస్పెండ్ చేస్తూ లేఖ విడుదల చేసిన భారత రాష్ట్ర సమితి పై కవిత ఆగ్రహం వ్యక్తం చేయొచ్చు. ఇది చెల్లదంటూ పేర్కొనవచ్చు. కానీ అలాంటి పని కవిత చేయలేదు. పైగా భారత రాష్ట్ర సమితి అధిష్టానం దారి తప్పినప్పటికీ.. తను మాత్రం పకడ్బందీ విధానాలతోనే బయటకు వచ్చారు. పక్కాగా రాజీనామా చేశారు. భారత రాష్ట్ర సమితి ప్రాథమిక సభ్యత్వానికి ఆమె రాజీనామా చేశారు. ఆ లేఖను పార్టీ అధ్యక్షుడికి పంపించారు. శాసనమండలి సభ్యత్వానికి కూడా కవిత రాజీనామా చేశారు. స్పీకర్ ఫార్మేట్ లోనే రాజీనామా లేఖను పంపించారు. వాస్తవానికి పార్టీకి, - మిగతా3లో


## రాష్ట్రపతి కారుకు జీఎస్టీ మినహాయింపు?

- కొత్త వాహనం ఖరీదు రూ.3.66 కోట్లు
- రాష్ట్రపతి వాహనశ్రేణిని క్రమం తప్పకుండా అప్‌గ్రేడ్ చేస్తుంటారు
- భద్రతా కారణలరీత్యా వీటిల్లోకి విలాసవంతమైన, కస్టమ్ బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను మాత్రమే తీసుకొంటారు.



# మీరు అంతర్గత కలహాలకు చెక్ పెడితే అధికారం మనదే

**చెన్నై:** తమిళనాడు బీజేపీలో అంతర్గత కలహాలకు చెక్ పెట్టి కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా రాష్ట్ర బీజేపీ నేతలకు దిశానిర్దేశం చేశారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్ర రాజకీయ పరిస్థితులను వివరించేందుకు అమిత్‌షాతో రాష్ట్ర బీజేపీ నేతలు న్యూఢిల్లీలో బుధవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఎన్డీయే కూటమిలో ఉన్న మిత్రపక్షాల సహకారంతో మరికొన్ని పార్టీలను కలుపుకుని కూటమి బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అమిత్‌షా రాష్ట్ర నాయకుల అభిప్రాయాలను తెలుసుకున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం అన్ని పార్టీలు ఏర్పాట్లు ముమ్మరం చేయగా, అమిత్‌షా కూడా ఇప్పటికే రెండు సార్లు రాష్ట్రానికివచ్చి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, కూటమిలోని మిత్రపక్షాల నేతలతో సమావేశమై కూటమి ఖరారుచేసి వెళ్లారు. అమిత్‌షా ఇచ్చి ప్రోత్సాహంతో రాష్ట్ర బీజేపీ అన్ని జిల్లాల్లో బూత్ కమిటీలను పటిష్ఠం చేసేలా తిరునల్వేలిలో తొలి మహానాడును విజయవంతంగా నిర్వహించింది. మరోవైపు అన్నాడీఎంకే-




బీజేపీ కూటమి విజయం కోసం మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి చేపట్టిన రాష్ట్రవ్యాప్త పర్యటన దాదాపు 50 శాతానికి పైగా పూర్తయ్యింది.

ఈ కూటమిని ఎలాగైనా చీల్చేందుకు ఇండియా కూటమిలోని రాష్ట్రనేతలు బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఎన్నికల్లో ఓటు చోరీ జరుగుతోందంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన పోరాటాలకు అధికార డీఎంకే మద్దతు తెలియజేయడంతో పాటు ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా బిహార్‌లో జరిగిన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. దీని వలన రాష్ట్రంలో బీజేపీ కూటమికి వ్యతిరేకంగా చేపడుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టడం ఎలా? కూటమిని మెజారిటీ సీట్లలో గెలిపించేందుకు వ్యవహరించాల్సిన తీరు, ఓటర్లను ఆకట్టుకునేలా సాగించాల్సిన ప్రచార యుక్తి, బూత్ కమిటీల పనితీరు.. తదితర అంశాలపై రాష్ట్ర బీజేపీ నేతలకు అమిత్‌షా మెళుకువలు నేర్పినట్లు సమాచారం. బీజేపీ నేతల్లో ఏర్పడిన అభిప్రాయభేదాలను పక్కనబెట్టి పార్టీ ఓటు బ్యాంకు పెంచే దిశగా కృషిచేయాలని బీజేపీ శ్రేణులకు ఆయన సూచనలిచ్చినట్లు తెలిసింది. అమిత్‌షా ఆహ్వానం మేరకు న్యూఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ అధ్యక్షురాలు తమిళిసై సౌందర్‌రాజన్, సీనియర్ నాయకులు హెచ్.రాజా, కేశవ వినాయగం, బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అరవింద్‌మేనన్, కో-ఇన్‌ఛార్జి డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డితో పాటు పలువురు ముఖ్యనేతలు హాజరు కాగా, అన్నామలై ఈ సమావేశంలో పాల్గొనలేదని బీజేపీ వర్గాలు తెలిపాయి.

## జాతీయ రహదారి 2ను తెరిచేందుకు కుకీలు అంగీకారం..

# మణిపూర్‌లో శాంతికి ఊతం

**ఇంఫాల్:** మణిపూర్‌లోని కీలకమైన జాతీయ రహదారి-2ను తిరిగి తెరిచేందుకు కుకీలు అంగీకరించారు. ఆ రాష్ట్ర జీవనాధారమైన ఈ జాతీయ రహదారిని ప్రయాణికులు, సరుకు రవాణా కోసం తెరిచేందుకు కుకీ, జోమి తెగలకు చెందిన సామూహిక వర్గం నిర్ణయించింది. ప్రధాని మోదీ త్వరలో మణిపూర్‌ను సందర్శించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో జాతీయ రహదారి 2లో స్వేచ్ఛా కదలికలకు అనుమతిస్తామని చురాచంద్‌పూర్‌కు చెందిన కుకీ జో కౌన్సిల్ ఇచ్చిన హామీని కేంద్ర హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ గురువారం ధృవీకరించింది. మణిపూర్‌లోని రెండు డజన్లకు పైగా ఉన్న కుకీ, జోమి, హ్మార్ తిరుగుబాటు గ్రూపులకు చెందిన రెండు సంయుక్త సంస్థలతో వివాదాస్పదమైన సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ (ఎస్‌వోఎస్) ఒప్పందాన్ని పునరుద్ధరించినట్లు ప్రకటించింది. కాగా, మణిపూర్ ప్రాదేశిక సమగ్రతకు భంగం వాటిల్లకుండా శాశ్వత శాంతి, స్థిరత్వాన్ని తీసుకురావడానికి చర్చల పరిష్కారం అవసరమని కుకీ తిరుగుబాటు గ్రూపులు, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం భావించాయి. ఈ నేపథ్యంలో గురువారం ఢిల్లీలో జరిగిన త్రైపాక్షిక సమీక్షా సమావేశంలో ఈ మేరకు కొత్త ఒప్పందంపై సంతకం చేశారు. మరోవైపు కీలకమైన జాతీయ రహదారి మార్గంలో శాంతి కోసం భద్రతా దళాలతో కలిసి పనిచేస్తామని కుకీ-జో



కౌన్సిల్ పేర్కొంది. తమ శిబిరాలను సంఘర్షణ ప్రాంతాల నుంచి దూరంగా తరలించడానికి అంగీకరించింది. అలాగే సమీపంలోని సీఆర్పీఎఫ్ లేదా బీఎస్ఎఫ్ శిబిరాలకు ఆయుధాలను తరలించేందుకు కూడా ఒప్పందం కుదిరింది. దీంతో జాతుల ఘర్షణలతో అల్లాడిన మణిపూర్‌లో ఈ కొత్త ఒప్పందం శాంతికి ఊతమియ్యనున్నది.

## 'భారత్‌పై టారిఫ్ విధించకపోతే అమెరికా అంతమే'.. సుప్రీంకోర్టులో ట్రంప్

**వాషింగ్టన్:** ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని ఆపి.. ఇరు దేశాల్లో మధ్య శాంతిని నెలకొల్పేందుకు తాను భారత్‌పై టారిఫ్‌లు విధించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశ సుప్రీంకోర్టుకు తెలిపారు. సుంకాలు విధించడం వల్లే దేశం ఆర్థికంగా ముందంజలో ఉంది.. లేదంటే అంతం అవుతుందని బదులిచ్చారు. భారత్‌తో పాటు ప్రపంచంలో పలు దేశాలపై 1977 ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్స్ పవర్స్ యాక్ట్ నిబంధనలకు మించి ఎక్కువ మొత్తంలో టారిఫ్‌లు విధించడాన్ని క్రిందికోర్టు తప్పుబట్టింది. దీంతో ఆ కేసు సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. టారిఫ్‌లపై ట్రంప్ ప్రభుత్వం తరుపున సొలిసిటర్ జనరల్ జాన్ సౌర్ తన వాదనల్ని వినిపిస్తున్నారు. తనవాదనల్లో ఉక్రెయిన్‌లో శాంతి కోసం మా ప్రయత్నాల్లో కీలకమైన అంశం. ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధం కొనసాగడానికి కారణం భారత్. భారత్.. రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తుంది. అమ్మకాల



ద్వారా వచ్చిన నిధుల్ని యుద్ధం కోసం ఖర్చు పెడుతున్నారు. ఇది ఏమాత్రం సమంజసం కాదు. అందుకే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకుగాను భారత్‌పై సుంకాలు విధించాం. ఇప్పుడీ టారిఫ్‌ల విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గించినా ఆర్థికంగా అమెరికాకు మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. సుంకాలతో అమెరికా ధనిక దేశం. సుంకాలు లేకపోతే పేద దేశం. ఇప్పటికే దేశాలపై సుంకాల్ని ఉపసంహరించుకుంటే దేశ రక్షణ-పారిశ్రామిక రంగం బలహీనపడుతుంది. వార్షిక వాణిజ్య లోటులో 1.2 ట్రిలియన్ల డాలర్ల వరకు నష్టం వాటిల్లుతుంది. కొనసాగుతున్న విదేశీ చర్చలపై అనిశ్చితి నెలకొంటుందని' అది వాదించింది. సుంకాల కారణంగా..ఆరు ప్రధాన వాణిజ్య భాగస్వాములు, 27 యూరోపియన్ యూనియన్ దేశాలతో కుదుర్చుకున్న ఫ్రేమ్‌వర్క్ ఒప్పందాలు అమెరికాను ప్రపంచ స్థానాన్ని బలోపేతం చేస్తుందని పేర్కొంది. ఏడాది క్రితం అమెరికా అంతమైన దేశం. మరి ఇప్పుడు.. వ్యాపారం చేస్తూ లాభాల్ని అర్జించిన దేశాలు చెల్లించే ట్రిలియన్ల డాలర్ల టారిఫ్‌ల కారణంగా.. అమెరికా మళ్ళీ అన్నీ రంగాల్లో బలమైన, ఆర్థికంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటుందని తెలిపింది. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును వాయిదా వేసింది.

## వారు జట్టు కడుతున్నారు.. సిద్ధంగా ఉండండి పెంటగాన్‌కు ట్రంప్ ఆదేశాలు

ఇంటర్నెట్‌డెస్క్: చైనా అధినేత జిన్‌పింగ్ రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ ఒకే వేదికపై కనిపించడం అమెరికా అగ్రనేత ట్రంప్‌ను కలవరపాటుకు గురిచేసింది. అవసరమైతే చైనా, రష్యాలను అడ్డుకొనేందుకు సిద్ధంగా ఉండాలని పెంటగాన్‌ను ఆయన ఆదేశించారు. అమెరికా సేనల్లో భారీస్థాయిలో మార్పులు చేయాలని సూచించారు. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఓ ఛానల్‌తో మాట్లాడుతూ తనకు ట్రంప్ నుంచి ఈమేరకు ఆదేశాలు వచ్చినట్లు అంగీకరించారు. మిలిటరీలో భారీ పునర్ వ్యవస్థీకరణను చేపట్టనున్నట్లు వెల్లడించారు. అదేమీ యుద్ధం కోరుకుంటూ చేసేది కాదని వివరణ ఇచ్చారు. చైనా, రష్యా మరేదైనా దేశం విషయంలో తమ పాలసీ స్పష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. నిన్న బీజింగ్‌లో విక్టరీ డే పరేడ్ సందర్భంగా చైనా ఆయుధ ప్రదర్శన అనంతరం ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేశారు. చైనా, ఉత్తర కొరియా, రష్యా దేశాలు అమెరికా కు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నాయన్నారు. కానీ, అవి ఎటువంటివో మాత్రం ఆయన వెల్లడించలేదు. చైనాను విదేశీ పాలకుల నుంచి విడిపించడంలో అమెరికా కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ఆ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమెరికన్ సైనికులను జిన్‌పింగ్ గుర్తిస్తారా, లేదా అనేది పెద్ద ప్రశ్న అని ట్రంప్ పేర్కొన్నారు.

## దీదీ ఘాటు వ్యాఖ్యలతో రణరంగంగా బెంగాల్ అసెంబ్లీ

బీజేపీ ఎమ్మెల్యేల జై శ్రీరాం నినాదాలతో, అరుపులతో, ఈడ్చివేతలతో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ రణరంగాన్ని తలపించింది. ప్రతిపక్షంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు చేయగా.. అడ్డుకునేందుకు వాళ్లు తీవ్రంగా ప్రయత్నించారు. ఈ క్రమంలో పరిస్థితి అదుపు తప్పడంతో మార్షల్స్ సాయంతో బీజేపీ ఎమ్మెల్యేలను స్పీకర్ బయటకు పంపించేశారు. బీజేపీపై మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు.. ప్రతిపక్ష బీజేపీ ఆందోళనలతో బెంగాల్ అసెంబ్లీ గురువారం అట్టుడికిపోయింది. ఇతర రాష్ట్రాల్లో బెంగాలీ వలస కూలీల పై జరుగుతున్న దాడులను ఖండిస్తూ టీఎంసీ ప్రభుత్వం ఓ తీర్మానం ప్రవేశపెట్టింది. అయితే ఈ తీర్మానంపై ప్రసంగిస్తూ.. సీఎం మమతా బెనర్జీ తీవ్ర వ్యాఖ్యలే చేశారు. బీజేపీని బెంగాల్ వ్యతిరేక పార్టీగా అభివర్ణించిన ఆమె.. ఓట్ల చోరీతో అతిపెద్ద దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. పార్లమెంట్‌లోనూ టీఎంసీ ఎంపీలను సీఐఎస్ఎఫ్ బలగాలను ఉపయోగించి ఏ విధంగా వేధించారో అంతా చూశారని అన్నారామె. బెంగాలీలను మోదీ, అమిత్ షాలు వేధిస్తున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారామె. "బీజేపీ అవినీతి పార్టీ. ఓట్ల దొంగ. అతిపెద్ద దోపిడీ పార్టీ. బీజేపీ నుంచి బెంగాల్‌ను, దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉంది అని ఆమె ప్రసంగించారు. ఆ సమయంలో బీజేపీ ఎమ్మెల్యేలు "జై శ్రీరాం" నినాదాలతో ఆమె ప్రసంగానికి అడ్డు తగిలారు. దీంతో ఆమె మరింత స్వరం పెంచారు. "రాసిపెట్టుకోండి. బెంగాల్ అసెంబ్లీలో బీజేపీకి ఒక్క ఎమ్మెల్యే కూడా లేకుండా పోతాడు. మీరు చేసే రాజకీయాలకు.. అధికార పీఠం నుంచి ప్రజలు మిమ్మల్ని దించేస్తారు. మోదీ షా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కుప్పకూలడం ఖాయం" అని అన్నారామె. బీజేపీ ఎమ్మెల్యేల ప్రవర్తన అన్‌పార్లమెంటరీగా ఉందన్న ఆమె.. బీజేపీ పాలిత



రాష్ట్రాల్లోనే బెంగాలీలపై దాడులు జరుగుతున్నందున అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ తరుణంలో.. బీజేపీ సభ్యులు మరింతగా ఊగిపోయారు. టీఎంసీ సభ్యులతో వాగ్వాదానికి దిగడంతో ఒకరినొకరు తోసేసుకున్నారు. దీంతో.. చీఫ్ విప్ డాక్టర్ శంకర్ ఘోష్ సహా బీజేపీ ఎమ్మెల్యేలను ఇవాళ్టి సెషన్ నుంచి స్పీకర్ సస్పెండ్ చేశారు. అయితే.. ఆయన బయటకు వెళ్లేందుకు నిరాకరించడంతో మార్షల్స్ సాయంతో బయటకు బలవం తంగా పంపించేశారు. ఈ క్రమంలో ఆయన స్పృహ కోల్పో వడంతో ఆస్పత్రికి తరలించారు. మరోవైపు.. ఈ పరిణామం తో ప్రతిపక్ష నేత సువేందు అధికారి హుటాహుటిన అసెంబ్లీ వద్దకు చేరుకున్నారు. మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. టీఎంసీ కేడర్‌ను గూండాలుగా అభివర్ణించారు. టీఎంసీ గూండాలు శంకర్ ఘోష్‌పై భౌతిక దాడికి పాల్పడ్డారని ఆరోపించారాయాన. మమతా బెనర్జీనే అతిపెద్ద దొంగ అని అన్నారు. ఇదిలా ఉంటే.. బెంగాల్ అసెంబ్లీ స్పెషల్ సెషన్ కార్యకలాపాలకు అడ్డుతగిలారని సువేందు అధికారిని ఇదివరకే సభ నుంచి సస్పెండ్ చేశారు.

## దేశ ప్రజలకు ప్రధాని మోదీ శుభవార్త.. కొత్త జీఎస్టీ అమల్లోకి వచ్చేది అప్పుడే





**న్యూఢిల్లీ:** యూపీఏ హయాంలో ప్రజలపై పన్నుల భారం ఎక్కువగా ప్రధాని మోదీ అన్నారు. సామాన్యులపై నిత్యావసర వస్తువుల భారం తగ్గించేలా జీఎస్టీ రేట్ల స్వరూపంలో కేంద్రం కీలక మార్పులు చేసింది. ఈ తరుణంలో కొత్త జీఎస్టీ స్లాబ్‌లపై ప్రధాని మోదీ స్పందించారు. జీఎస్టీ స్లాబ్ సంస్కరణలతో అందరికి ప్రయోజనం.దేశ చరిత్రలో ఇదో మైలురాయి. జీఎస్టీ సంస్కరణలతో దేశం మరింత బలపడుతుంది. నిత్యవసర వస్తువులు తగ్గుతాయి. సమయాన్ని బట్టి సంస్కరణలు అవసరం. యూపీఏ హయాంలోనే అధిక పన్నులు. గతంతో పన్నుల రూపంలో కాంగ్రెస్ నేతలు దోచుకున్నారు. దేశ చరిత్రలో ఇదొకమైలురాయి. దేశ ప్రజల దుర్భర జీవితానికి కాంగ్రెస్ కారణం. జీఎస్టీ స్లాబుల సవరణలతో జీఎస్టీ సంస్కరణలతో దివాళి గిఫ్ట్ ఇచ్చాం అని అన్నారు.

## రాష్ట్రపతి కారుకు జీఎస్టీ మినహాయింపు?



**ఇంటర్నెట్‌డెస్క్:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కాన్వాయ్‌లోకి సరికొత్త వాహనం చేరనుంది. ప్రస్తుతం ఆమె మెర్సిడెస్ బెంజ్-ఎస్600 పుల్‌మ్యాన్ లిమోజిన్‌ను వాడుతున్నారు. దీనిని సరికొత్త బీఎండబ్ల్యూ కారుతో భర్తీ చేయనున్నారు. కొత్త వాహనం ఖరీదు రూ.3.66 కోట్లు. రాష్ట్రపతి వాహనశ్రేణిని క్రమం తప్పకుండా అప్‌గ్రేడ్ చేస్తుంటారు. భద్రతా కారణలరీత్యా వీటిల్లోకి విలాసవంతమైన, కస్టమ్ బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను మాత్రమే తీసుకొంటారు. అందులోభాగంగానే ఈ కొత్త కారు రానుంది. సాధారణంగా ఈ హైఎండ్ కారును ఎవరైనా దిగుమతి చేసుకొంటే భారీ పన్నులు విధిస్తారు. దీనికితోడు 28 శాతం (సరికొత్త రేట్ల ప్రకారం అయితే 40%) జీఎస్టీ లేదా ఐజీఎస్టీ విధిస్తారు. ఇక బేసిక్ కస్టమ్స్ డ్యూటీ, అదనపు సెస్సు కలిసి ధర తడిసి మోపెడవుతుంది. కానీ, దేశ రాష్ట్రపతికి అవసరమైన వాహనం కావడంతో జీఎస్టీ కౌన్సిల్ ఐజీఎస్టీ, సెస్సు నుంచి దీనికి ప్రత్యేక మినహాయింపును ప్రతిపాదించింది. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇటీవల ఆమోదముద్ర పడింది. ఇలా మినహాయింపు ఇవ్వడం చాలా అరుదు. కేవలం ప్రత్యేక కేసులు, ప్రజాప్రయోజనాలు ఉన్న సమయంలో వాణిజ్యేతర వాహనాలకు మాత్రమే ఇలాంటి మినహాయింపు లభిస్తుంటుంది. ఈ క్రమంలో రాష్ట్రపతి సెడాన్ కారును దేశ ఆస్తిగా భావిస్తారు. తాజా చర్యతో ప్రెసిడెంట్ సెక్రటేరియట్ ఎటువంటి పన్నులు చెల్లించకుండా వాహనం కొనుగోలు చేసే అవకాశం లభించింది. ప్రస్తుతం వాడుతున్న ఎస్600 పుల్‌మ్యాన్ గార్డ్ భద్రతా ఫీచర్లకు పేరున్న కారు. దీనిలో బాలిస్టిక్, హెవీ ఆర్మర్ ప్లేటింగ్, మల్టీ లేయర్ బుల్లెట్ ప్రూఫ్ గ్లాస్, సెల్ఫ్ సీలింగ్ ఇంధన ట్యాంక్, ప్రత్యేకమైన టైర్లు, ఆక్సిజన్ సప్లై సిస్టమ్ వంటివి ఉన్నాయి.

## అదేం సీక్రెట్ కాదు..



**ఇంటర్నెట్‌డెస్క్:** షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొనేందుకు చైనా లో పర్యటించిన భారత ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌లు ద్వైపాక్షికంగా భేటీ అయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇరువురు అధినేతలు ఒకే కారులో కొంత దూరం మాట్లాడుకుంటూ ప్రయాణించారు. ఈ క్రమంలో వారు ఏం మాట్లాడుకున్నారనే దానిపై సర్వత్రా చర్చ జరిగింది. దీనిపై తొలిసారిగా పుతిన్ స్పందించారు. చైనా పర్యటన పూర్తి చేసుకున్న పుతిన్ మీడియాతో మాట్లాడారు. ఈసందర్భంగా మోదీతో కారులో జరిగిన సీక్రెట్ సంభాషణ గురించి ఓ విలేకరి ఆయన్ను ప్రశ్నించారు. దీనికి పుతిన్ బదులిస్తూ.. 'అదేం పెద్ద రహస్యం కాదు. అలాస్కాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన చర్చల గురించి మోదీకి వివరించాను' అని పేర్కొన్నారు. కాగా.. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించే అంశంపై ట్రంప్, పుతిన్‌లు ఇటీవల అలాస్కాలో సమావేశమయిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా ఈ ఇద్దరు నేతలు కారులో ప్రయాణించారు. ఆ కారులో అమెరికా అధినేతతో జరిగిన సంభాషణ వివరాలు కూడా ఇప్పుడు పుతిన్ పంచుకున్నారు. ట్రంప్‌తో తన సంభాషణ బ్రోకెన్ ఇంగ్లీష్‌లోనే జరిగిందని తెలిపారు. తాము 30 సెకన్లు మాత్రమే మాట్లాడుకున్నామని.. ట్రంప్ ఆరోగ్యంగా ఉండటం చూసి సంతోషంగా ఉన్నానని అతనితో చెప్పినట్లు వెల్లడించారు. ఎస్‌సీవో సదస్సుకు పుతిన్ తన వాహన కాన్వాయ్‌ను తీసుకొచ్చారు. పది నిమిషాలు నిరీక్షించి మరీ.. మోదీని పుతిన్ తన కారులో తీసుకెళ్లారు. దాదాపు ముప్పావుగంటసేపు ఇరువురి నేతలు ఏకాంతంగా మాట్లాడుకున్నారని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి పేర్కొన్నారు. పుతిన్‌తో కారులో ప్రయాణించిన ఫొటోను మోదీ నాడు ఎక్స్‌లో పంచుకున్నారు. తమ మధ్య చర్చలు ఎప్పుడూ వివేకంతో జరుగుతాయని, ఈసారీ అద్భుతంగా సాగాయని తెలిపారు. అమెరికా సుంకాల బాదుడు నేపథ్యంలో వీరి ద్వైపాక్షిక భేటీ తీవ్ర చర్చనీయాంశమైంది.

http://www.agnidharanews.com
అగ్నిధార

# కవిత హడావిడేనా



**హైదరాబాద్ :** కల్వకుంట్ల కవిత ఇక బయటకు వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. అయితే ఆమె భవిష్యత్ ప్రణాళిక మాత్రం కొత్త పార్టీ అన్నది మాత్రం అర్థమవుతుంది. బీఆర్ఎస్ నాయకత్వం తనపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని కవిత జీర్ణించుకోలేకపోతున్నారు. తన తండ్రి చుట్టూ దయ్యాలున్నాయని, తన తండ్రి దేవుడని అన్నప్పటికీ కేసీఆర్ కుమార్తె విషయంలో వెనక్కు తగ్గలేదు. పార్టీ కోసం కల్వకుంట్ల కవితను సస్పెండ్ చేశారు. అసలే తనకు పార్టీలో జరుగుతున్న అన్యాయానికి రగిలిపోతున్న కవిత సస్పెన్షన్ తో మరింతగా రగిలిపోతున్నట్లే ఉంది. అందుకే కవిత పార్టీకి గుడ్ బై చెప్పాలని నిర్ణయించుకుంది. దీంతో పాటు పార్టీ తనకు ఇచ్చిన ఎమ్మెల్సీ పదవి కూడా త్యజించి జనంలోకి వెళ్లేందుకు సిద్ధమయినట్లు కనిపిస్తుంది.. కల్వకుంట్ల కవిత తన తండ్రి కేసీఆర్ పై యుద్ధం కాకుండా, బీఆర్ఎస్ పార్టీ నేతలపైనే వార్ ప్రకటించేందుకు సిద్ధమయినట్లు కనపడుతుంది. ఇప్పటికిప్పుడు కాకపోయినా కవిత కొత్త పార్టీ ప్రకటించే అవకాశాలను ఎవరూ కొట్టిపారేయలేరు. తన తండ్రి కేసీఆర్ తనపై సస్పెన్షన్ నిర్ణయాన్ని తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకున్నారని ఆమెకు తెలుసు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి సీబీఐ విచారణతో చికాకులో ఉన్న పెద్దాయనను కవిత మరింత చికాకు పెట్టినట్లయింది. అయితే కవిత చాలా రోజులుగా పార్టీపైన, నేతలపైన విమర్శలు చేసినా కేసీఆర్ ఓపిక పట్టారు. పెద్దగా పట్టించుకోనట్లు వదిలేశారు. అయితే కాళేశ్వరం విషయంలో కవిత చేసిన కామెంట్స్ ఆయననే ఇబ్బంది పెట్టాయి. కనీసం బంధువులని లేకుండా, పార్టీలో తనకు ముఖ్యులని తెలిసినా కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలతో ఆయన ఇబ్బంది పడ్డారు. అందుకే ఆయన తన భార్యతోనూ చర్చించారు. కుమార్తె అని చూస్తూ ఊరుకుంటే రానున్న ఎన్నికలకు ముందు మరింత మంది నేతలు రెచ్చిపోయే అవకాశాలు లేకపోలేదు. అందుకే కవితను సస్పెండ్ చేసి ఆమె భవిష్యత్ లో చేసే విమర్శలకు ప్రాధాన్యత లేకుండా ప్రస్తుతానికి అయితే చేయగలిగారు. కవిత ఇప్పుడు ఏం మాట్లాడినా ప్రజలు పెద్దగా పట్టించుకోరు. అయితే ఒకటి మాత్రం నిజం. ఏపీలో వైఎస్ షర్మిలను ఎవరూ పట్టించుకునే వారు లేరు. తొలినాళ్లలో ఉన్న క్రేజ్ రానురాను తగ్గిపోయింది. కవిత విషయంలోనూ అదే జరుగుతుంది. సొంత పార్టీ పెట్టినా కల్వకుంట్ల కవిత చేతులు కాల్చుకోవడం తప్ప మరొక ప్రయోజనం ఉండదన్నది వాస్తవం. మరి కవిత తీసుకునే నిర్ణయం ఆమెకే వదిలేసిన్నా.. రాజకీయంగా ఏదో ఒకరోజు మళ్లీ కారు ఎక్కాల్సిందేనని చెప్పక తప్పదు.

**సెంటిమెంట్ జోడిస్తూ..**

కవిత మీడియా సమావేశాన్ని పరిశీలించినప్పుడు ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది. తనకు తండ్రి కేసీఆర్, సోదరుడు కేటీఆర్ లపై ఎటువంటి వ్యతిరేకం లేదని చెప్పకనే చెప్పారు. కేసీఆర్, కేటీఆర్ లు మంచోళ్లేనని, కానీ ఆయన పక్కన ఉండి చెడగొడుతుంది హరీశ్ రావు, సంతోష్ రావులు మాత్రమేనని అన్నారు. కేటీఆర్ ను ఓడించడానికి హరీశ్ రావు అరవై లక్ష రూపాయలు సిరిసిల్ల నియోజకవర్గానికి పంపారని తెలిపారు. అలాగే కేసీఆర్ ను ఓడించడానికి కూడా హరీశ్ రావు ప్రయత్నించారని తెలిపారు. అదే సమయంలో దుబ్బాక ఉప ఎన్నికల్లో ఓటమికి కూడా హరీశ్ రావు కారణమని ఆమె చెప్పారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో పార్టీ ఓటమికి కూడా హరీశ్ రావు కారణమని కల్వకుంట్ల కవిత తెలిపారు. ఎన్ని జన్మల పుణ్యముంటే తనకు కేసీఆర్ లాంటి తండ్రి ఉంటారని కూడా సెంటిమెట్ తో కొట్టారు. హరీశ్ రావు, సంతోష్ రావులు గత కొన్నేళ్ల నుంచి తనపై కుట్రలు చేస్తూ వస్తున్నారని, వాళ్లిద్దరూ రేవంత్ రెడ్డి తో ఏకమై తనను బయటకు పంపేందుకు కూడా కుట్రలు పన్నింది వాళ్లేనని స్పష్టంగా చెప్పారు. వ్యక్తిగత లబ్ది పొందేవాళ్లు తాము ముగ్గురం కలసి ఉండొద్దని భావించి మొదటి అడుగులో తనను పార్టీ నుంచి బయటకు పంపారని అన్నారు. తనకు తొలిసారిగా ఆరడుగుల బుల్లెట్ తాకిందని, తర్వాత రామన్నను, తర్వాత కేసీఆర్ ను కూడా తాకే అవకాశం లేకపోలేదని కవిత తెలిపారు. తాను, కేటీఆర్ లు తెలంగాణ ఉద్యమం సమయంలో తండ్రి పడుతున్న కష్టాన్ని చూసి ఆయన వెంట నడిచామన్నారు. తమ కుటుంబం విచ్ఛిన్నమైతే వారు బాగుపడతారని భావించి ఉండవచ్చు అని అన్నారు.కేసీఆర్ కు కూడా కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. మీ చుట్టూ ఏం జరుగుతుందో ఒక్కసారి చూసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకోవడానికి కుట్రలో భాగంగానే తనపై ఈ నిర్ణయం తీసుకునేలా కేసీఆర్ పై వత్తిడి తెచ్చారన్నారు. కవిత మీడియా సమావేశం చూసిన వారికి ఎవరికైనా.. తండ్రి కేసీఆర్ ను దూరం చేయాలని భావించడం లేదు. అలాగే సోదరుడు కేటీఆర్ కు, తనకు ఏ మాత్రం విభేదాలు లేవని కూడా ఆమె నేరుగానే చెప్పారు. తన కుటుంబం బాగుండాలని కోరుకుంటున్నానని చెబుతూ పార్టీలో అగ్రనేతలైన కేసీఆర్, కేటీఆర్ లను ఆకట్టుకునే ప్రయత్నం కవిత మీడియా సమావేశంలో కనపడిందని చెప్పాలి. హరీశ్ రావు, సంతోష్ రావు లను మాత్రమే ఆమె లక్ష్యంగా చేసుకుని మాట్లాడారు.

# రూ.26.49 కోట్లతో మహబూబాబాద్ రైల్వేస్టేషన్ రీడెవలప్‌మెంట్

**వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అమృత్ భారత్ పథకంతో దేశంలో రైల్వే స్టేషన్ల రూపురేఖలు మారిపోతున్నాయి. కొన్ని రైల్వేస్టేషన్ల అభివృద్ధి చూస్తే ఇది రైల్వేస్టేషనా, లేక విమానాశ్రయమా అనే తరహాలో అప్‌గ్రేడ్ చేస్తున్నారు. అందుకోసం కొన్ని రోజులపాటు రైల్వేస్టేషన్లకు కొన్ని రైళ్లను దారిమళ్లించడం లాంటివి చేశారు. తెలంగాణలో సికింద్రాబాద్, బేగంపేట, కరీంనగర్, మహబూబాబ్ రైల్వే స్టేషన్లను అమృత్‌భారత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. త్వరలోనే మహబూబాబాద్ రైల్వేస్టేషన్ అందుబాటులోకి రానుంది. రూ. 26.49 కోట్ల వ్యయంతో చేపట్టిన మహబూబాబాద్ రైల్వేస్టేషన్ పనులు దాదాపు పూర్తయ్యాయని కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి తెలిపారు. అత్యాధునిక సౌకర్యాలతో ఈ రైల్వే స్టేషన్ త్వరలోనే ప్రారంభించనున్నారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్ బిల్డింగ్, వెయిటింగ్‌హాల్ పనులు, కవర్ ఓవర్ ప్లాట్‌ఫాం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఓవరాల్ గా చూస్తే 92 శాతం మేర పని పూర్తయిందని, అత్యాధునిక సౌకర్యాలతో సిద్ధమవుతోందన్నారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్ ఫొటోల్ని కిషన్ రెడ్డి విడుదల చేశారు. తెలంగాణలో రైల్వే సదుపాయాల కల్పనకు కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కృషి చేస్తుందని, అందుకు తగిన నిధులు అందించి రైల్వే స్టేషన్ల అప్‌గ్రేడేషన్ చేస్తున్నట్లు కిషన్ రెడ్డి పేర్కొన్నారుదేశంలోని రైల్వేస్టేషన్లను ఆధునీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన దీర్ఘకాలిక ప్రణాళికనే ఈ 'అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్' అని చెప్పవచ్చు. ఈ పథకం కింద దేశంలోని కొన్ని రైల్వేస్టేషన్లను ఎంపిక చేసి దశలవారీగా ఒక్కో స్టేషన్‌కు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసి, పునరాభివృద్ధి పనులు చేపడుతున్నారు.




గతంలో కంటే రైల్వేస్టేషన్లను మరింత అందంగా, పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా ఉండేలా మార్చడమే దీని లక్ష్యం.రైల్వే స్టేషన్‌లోకి ప్రవేశం, నిష్క్రమణ మార్గాల మెరుగుదల, విశాలమైన వెయిటింగ్ హాళ్లు, పరిశుభ్రమైన ప్లాట్‌ఫారమ్‌లు, మరుగుదొడ్లు, రైల్వేస్టేషన్ పైకప్పులు వంటివి పునరుద్ధరిస్తారు.రైల్వే స్టేషన్లకు దగ్గర్లో ఉన్న నగరాలను కలుపుతూ స్టేషన్ బిల్డింగ్ అప్‌గ్రేడ్ చేస్తారు. ఈ రైల్వేస్టేషన్లను బస్సులు, ఇతర రవాణా వ్యవస్థలతో అనుసంధానం చేస్తారు. అవసరమైన చోట లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తారు. ఉచిత వై-ఫై సదుపాయం, మెరుగైన సమాచార వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైన రైల్వే స్టేషన్లలో ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు, బిజినెస్ మీటింగ్స్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక స్టేషన్ ఒక ఉత్పత్తి పథకం కింద స్థానిక ఉత్పత్తులను విక్రయించడానికి వీలు కల్పించారు. ఫుడ్ కోర్టులు, ఆట స్థలాలు వంటివి ఏర్పాటు చేస్తారు. స్టేషన్ సమీపంలో రోడ్లను వెడల్పు చేయడం, అవసరం లేని నిర్మాణాలు ఉంటే తొలగించడం, ప్రత్యేక పాదచారుల మార్గాలు , మెరుగైన పార్కింగ్, బెస్ట్ లైటింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నారు. బ్రెయిలీ సంకేతాలు, స్పర్శతో గుర్తించదగిన మార్గాలు, లిఫ్ట్‌లు, ర్యాంప్‌లు వంటి సదుపాయాలతో దివ్యాంగులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు.

## అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

**యూరియాపై రియాక్షన్..**

రైతులు ఎక్కువ సేపు లైన్లో నిలబడి అలిసిపోతున్నారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అలిసిపోవడం వల్ల అసలు యూరియా లేదని చెప్తున్నారని పేర్కొన్నారు. యూరియా సరిపడా అందుబాటులో ఉందని చెప్పుకొచ్చారు. అందరూ ఒకే దగ్గర ఉండేసరికి యూరియా కోసం ఉన్న లైన్ పెద్దగా కనిపిస్తుందని స్పష్టం చేశారు. లైన్లో చివర ఉన్న వారికి యూరియా ఇవ్వాలంటే 8 గంటల సమయం పడుతుందని వివరించారు. ఆ 8 గంటలు లైన్లో నిలబడలేక, సహనం కోల్పోయి.. ధర్నాలు చేస్తున్నారని అన్నారు. రైతులను ఎవరో ఒకరు తీసుకెళ్లి కావాలనే రోడ్ల మీద కూర్చో పెడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.

భారీ వర్షాలతో నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించి బాధితులకు ధైర్యం చెప్పారు. బురుగిద్ద వద్ద ఇసుక మేటలు వేసిన పొలాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ క్రమంలో తమకు జరిగిన నష్టాన్ని రైతులు వివరించారు. అలాగే, లింగంపేట్‌లో బ్రిడ్జి పరిస్థితిని పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణానికి పూర్తిస్థాయి ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. బ్రిడ్జి కమ్ చెక్‌డ్యామ్ తరహాలో నిర్మించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

**ప్రత్యేకంగా నిధులు..**

'వరదలకు మైనర్, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. పోచారం ప్రాజెక్టు వరదలకు తట్టుకుని నిలబడి మిమ్మల్ని కాపాడింది. తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేశాం. ప్రత్యక్షంగా మీ కష్టాలను, జరిగిన నష్టాలను చూడటానికే ఇక్కడకు వచ్చాం. శాశ్వత పరిష్కారం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించాం. పంటపొలాల్లో ఇసుక మేటలు తొలగించడానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తాం. పంట నష్టపరిహారం అందిస్తాం. రోడ్లు, ప్రాజెక్టులను మరమ్మతులు చేసేందుకు అధికారులు అంచనాలు రూపొందించాలి. అన్ని సమస్యలు పరిష్కరించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులు పూర్తిస్థాయిలో వరద నష్టాన్ని అంచనా వేయాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

**కార్మికులను ఆదుకుంటాం..**

'వరదలతో పేదలు, రైతులు, విద్యార్థులు నష్టపోయారు. విద్యార్థులందరికీ వెంటనే పుస్తకాలు అందజేయాలని ఆదేశించాం. వరదల్లో నష్టపోయిన బీడీ, ఇతర పరిశ్రమ కార్మికులను ఆదుకుంటాం. కొడంగల్ ఎలాగో.. నాకు కామారెడ్డి కూడా అలాగే. అధికారుల అప్రమత్తతతో ప్రాణనష్టం జరగలేదు. సహాయక చర్యల్లో నేతలు, అధికారులు పాల్గొన్నారు. పలు శాఖలను సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాం. ముంపు ప్రాంత ప్రజలను కలుసుకునేందుకే ఇక్కడకు వచ్చాం. శాశ్వత పరిష్కారం దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## సర్వం సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

వినాయక నిమజ్జనం 6వ తేదీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిమజ్జనం మధ్యాహ్నం 1:30 గంటలోపు పూర్తిచేయాలని టార్గెట్ పెట్టుకున్నట్లు వెల్లడించారు.

**రోడ్డు సేఫ్టీ డ్రైవ్..**

నగరంలో వినాయక నిమజ్జనాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు కూడా అలర్ట్ అయ్యారు. భారీ వర్షాలకు నగరంలోని పలుప్రాంతాల్లో రహదారులు గుంతలమయంగా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు రోడ్డు సేఫ్టీ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. డే అండ్ నైట్ రోడ్ల మరమ్మతు పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికీ 11,442 గుంతలను పూడ్చి వేసినట్లు స్పష్టం చేశారు. రేపు(శుక్రవారం) అర్ధరాత్రి వరకు నగర వ్యాప్తంగా రోడ్ల మరమ్మతు పనులు పూర్తి చేయాలని సిబ్బందికి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

## తమకు బీఆర్ఎస్‌కు ఎలాంటి స్నేహం లేదు

-మొదటిపేజీ తరువాయి

కాళేశ్వరంపై ఘోష్ కమిషన్ వేసింది శిక్షించేందుకు కాదని తెలిపారు. కేవలం అక్కడ జరిగిన అక్రమాలను తెలుసుకునేందుకు అని పేర్కొన్నారు. నిజంగా అక్రమాలు జరిగితే.. దోషులను శిక్షించేందుకు మాత్రమే కేసును సీబీఐకి అప్పగించామని ఆయన చెప్పుకొచ్చారు. కేసు విషయంలో చేతకాకపోతే.. వారికి అప్పగిస్తే 48 గంటల్లో తెలుస్తామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అంటున్నారని గుర్తు చేశారు. మరి ఇంత కాలం బీజేపీ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. నిజాలు ఎప్పటికైనా బయటకు రాక తప్పదని ఆయన నొక్కిచెప్పారు.

## ఆచితూచి కవిత అడుగులు

-మొదటిపేజీ తరువాయి

శాసనమండలి సభ్యత్వానికి కవిత రాజీనామా చేస్తారని ముందుగా ఊహించిందే. అయితే ఇందులో అసలైన సంచలనం ఏంటంటే.. పార్టీ పేరును కవిత ప్రకటించకపోవడం.. బుధవారం నాటి విలేకరుల సమావేశంలో కవిత తన రాజకీయ పార్టీ పేరును ప్రకటిస్తారని.. తన రాజకీయ కార్య క్షేత్రాన్ని వివరిస్తారని అందరూ అనుకున్నారు. కానీ అలా కాకుండా కవిత పార్టీ విషయంలో.. తన రాజకీయ విషయంలో ఇప్పటికీ సస్పెన్స్ కొనసాగిస్తూనే ఉన్నారు. కాకపోతే జాగృతి ఆధ్వర్యంలో ఆమె కార్యక్రమాలు నిర్వహిస్తారని కార్యకర్తలు చెబుతున్నారు. భారత రాష్ట్ర సమితికి రాజీనామా చేసినప్పటికీ.. శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేసినప్పటికీ చివర్లో జై తెలంగాణ.. జై కేసీఆర్ అంటూ ఆమె నినాదాలు చేశారుఈ ప్రకారం చూసుకుంటే ఆమె పార్టీ ఏర్పాటు విషయంలో కాస్త నిదానాన్ని పాటించే అవకాశం కనిపిస్తోంది. అంతేకాదు కొన్ని విషయాలలో వేచి చూసే ధోరణి ప్రదర్శిస్తుందని సమాచారం. కొద్దిరోజుల పాటు నిశ్శబ్దంగా ఉండి.. జాగృతి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించి.. ఆ తర్వాత దీపావళి నాటికి రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తారని ఆమె అనుచరులు అంటున్నారు. ఒకవేళ అదే గనుక నిజమైతే.. ఈలోపు పార్టీ అధిష్టానం ఆమె మీద ఉన్న ఆగ్రహాన్ని తగ్గించుకుంటే.. మళ్లీ భారత రాష్ట్ర సమితి కండువాను కవిత కప్పుకుంటారని కొంతమంది విశ్లేషకులు అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ రాజకీయ పార్టీ పేరును ప్రకటించకుండా.. తన రాజకీయ క్షేత్రాన్ని వెల్లడించకుండా కవిత సస్పెన్స్ కొనసాగిస్తున్నారు. అయితే ఇది ఎక్కడ వరకు వెళ్తుంది.. ఎంతవరకు దారి తీస్తుంది.. అనే ప్రశ్నలకు మాత్రం త్వరలోనే సమాధానం లభిస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# గుత్తా రాజకీయ ప్రేమలేఖలు

**నల్గొండ :** నల్లగొండ జిల్లా రాజకీయాల్లో గుత్తా సుఖేందర్‌రెడ్డి ముద్ర. ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయాల్లో గుత్తా సుఖేందర్ రెడ్డి సీనియర్ నేతగా ఉన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన గుత్తా సుఖేందర్ రెడ్డి.. రాజకీయాల్లో తనదైన ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. మూడుసార్లు ఎంపీగా, రెండోసారి శాసనమండలి సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఆయన రాజ్యాంగ బద్ధమైన శాసనమండలి చైర్మన్ గా కొనసాగుతున్నారు. నిత్యం ప్రజాజీవితంలో ఉండేందుకే ఇష్టపడే సుఖేందర్ రెడ్డి.. ముక్కు సూటిగా వ్యవహరిస్తారని పేరుంది. పార్టీల కతీతంగా వివాదారహితుడిగా గుత్తాను నేతలు, కార్యకర్తలు అభిమానిస్తారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్నప్పటికీ ఆయన ప్రజా సమస్యలపై స్పందిస్తుంటారు. అవసరమైన సందర్భాల్లో రాజకీయ వ్యాఖ్యలు చేయడంతోపాటు ప్రభుత్వానికి లేఖాస్త్రాలు సంధిస్తున్నారట. ప్రజాపాలనలో ప్రభుత్వం విమర్శలు పాలుకావొద్దని పలు సమావేశాల్లో గుత్తా పరోక్ష హెచ్చరికలు చేశారట. తన రాజకీయ వ్యాఖ్యలతో ప్రభుత్వానికి సలహాలు, సూచనలతో సుతిమెత్తని చురకలంటిస్తున్నారట. ఇరిగేషన్ ప్రాజెక్టుల రివ్యూ సమావేశాల్లోకీలక వ్యాఖ్యలు. ఉమ్మడి జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టుల మీద పట్టున్న గుత్తా.. ఇరిగేషన్ ప్రాజెక్టుల రివ్యూ సమావేశాల్లో .. కీలక వ్యాఖ్యలు చేశారట. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుకు పుట్టంగండి నుండి సాగునీటిని విడుదల చేయాలని ప్రతిపక్షాలు ఆందోళన చేశాయి. దానికి కౌంటర్ గా తనదైన శైలిలో స్పందించిన గుత్తా పుట్టంగండి పంపుహౌజ్ వద్ద ఐదో మోటారు అమర్చేందుకు రూ.148కోట్లు తక్షణమే మంజూరు చేయాలని ఇరిగేషన్ మినిస్టర్ ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు. ఎంఎమ్ఆర్పీ ప్రాజెక్టు మెయిన్ కెనాల్ లైనింగ్ పనుల విషయంలో కూడా గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇదేరకంగా స్పందించారట.

రూ.400కోట్లు లైనింగ్ పనులకు శాంక్షన్ చేశామని మంత్రి ఉత్తమ్ చెప్పినప్పుడు కూడా కేవలం లైనింగ్ మాత్రమే సరిపోదని, కాలువ వెడల్పు కూడా పెంచాలని దానికి తగ్గట్టుగా డిజైన్ చేయాలని సూచించారట. అంతేకాదు ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీ ఆలస్యం చేస్తోందని, దాని వల్ల కేడర్?లో అసంతృప్తి పెరిగిపోయే ప్రమాదం ఉందని గతంలో గుత్తా హాట్? కామెంట్స్ చేశారు. తాజాగా సీఎం రేవంత్ రెడ్డికి గుత్తా సుఖేందర్ లేఖ. తాజాగా సీఎం రేవంత్ రెడ్డికి కూడా గుత్తా సుఖేందర్ లేఖ రాశారు. రాష్ట్రంలో మన ఊరు మన బడి కార్యక్రమంలో చేసిన పనులకు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించ లేదు. స్కూల్ బిల్డింగ్ ల నిర్మాణం కోసం అప్పటి కాంట్రాక్టర్లు, స్కూల్ మేనేజ్మెంట్ .. ఎస్ఎంసీ కమిటీలు అప్పుల పాలయ్యాయరని తక్షణమే రూ.361.350కోట్లు చెల్లించాలని సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు. మన ఊరు మన బడి బిల్లులు చెల్లించాలని పలువురు కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో గుత్తా సుఖేందర్ రెడ్డి సీఎం రేవంత్ కు లేఖ రాయడం వెనక అంతర్యమేమై ఉంటుందని జిల్లాలో చర్చ జరుగుతోందట. ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో తనకంటూ ఒరవడిని సృష్టించుకున్న గుత్తా సుఖేందర్ రెడ్డి ఏ విషయంలో కూడా రాజీపడటంలేదంట. గుత్తా బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కూడా పార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై మాజీ సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లిన సందర్భాలు అనేకం ఉన్నాయట. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలకు భూసేకరణ విషయంలో గుత్తా చొరవతోనే రైతులను ఒప్పించగలిగారట. కొడుకు గుత్తా అమిత్‌రెడ్డి రాజకీయ భవిష్యత్తు కోసమా? ఉపాధి హామీ నిధుల పంచాయితీలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కౌంటర్‌గా జిల్లా కలెక్టర్ కు గుత్తా నోటీసులు ఇచ్చారు. జిల్లాలో ప్రభుత్వం తరపున జరిగే ప్రతి కార్యక్రమానికి, జిల్లా మంత్రుల రివ్యూ మీటింగ్‌లలో పాల్గొంటున్న గుత్తా ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి పరోక్ష చురకలు అంటిస్తూ, విమర్శలు చేస్తున్నారట. తనయుడు గుత్తా అమిత్ రెడ్డి రాజకీయ భవిష్యత్తుకు బాటలు వేయడానికి పెద్దాయన పావులు కదుపుతున్నారన్న అభిప్రాయం వ్యక్తం అవుతోది. ఇప్పటికే ఆయన కుమారుడు అమిత్ రాష్ట్ర డెయిరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. అమిత్‌రెడ్డి పొలిటికల్ ఫ్యూచర్ కోసమే గుత్తా.. రాజకీయ వ్యాఖ్యలతో, ప్రభుత్వానికి లేఖాస్త్రాలతో జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పుతున్నారట. మొత్తానికి ఆయన పొలిటికల్ ప్రేమలేఖల వెనక ఆంతర్యం ఏంటని పొలిటికల్ సర్కిల్స్ చర్చించుకుంటున్నారట. మరికొందరు మాత్రం రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ గుత్తా సుఖేందర్ రెడ్డి లేఖాస్త్రాలతో సరికొత్త రాజకీయ ఒరవడికి శ్రీకారం చుట్టారనీ జిల్లాలో టాక్. మరి సీనియర్‌మోస్ట్ లీడర్ అయిన గుత్తా వ్యూహాలు ఎంతవరకు ఫలిస్తాయో చూడాలి

శుక్రవారం 5 సెప్టెంబర్ 2025
అగ్నిధార
http://www.agnidharanews.com
నిజాల నిప్పు కణిక

## సంపాదకీయం

# దాతృత్వానికి ప్రతీక


అమ్మ అంటే త్యాగం. అమ్మ అంటే నమ్మకం. అమ్మ అంటే కరుణ. అమ్మ అంటే అనంతమైన ప్రేమ. కన్న తల్లి బిడ్డల కడుపు చూస్తుంది. అమ్మ చేతి స్పర్శ విశ్వాసాన్ని కూర్చే ఔషధం. ప్రేగు బందం పెనవేసుకున్న అమ్మకు మించిన దైవం లేదు. అమ్మ హస్తం అమృత తుల్యం. కన్న తల్లి ప్రేమను కురిపించడం సర్వసాధారణం. అమ్మ కాని అమ్మలు కూడా తల్లిని మరిపించి, సకల సపర్యలు చేస్తే అదో అద్భుతం, కనివిని ఎరుగని విశేషం. అవసరార్థులు, ఆకలితో అలమటించే అభాగ్యులు, తీవ్ర రోగాల బారిన పడి జీవచ్ఛవంలా బతుకులను ఈడుస్తున్న కడు పేదలకు తానే కన్న తల్లిగా మారి, సకల సపర్యలు చేసి, వారి ముఖాల్లో చిరునవ్వులు చూడగలగడం ఆమెకే సొంతం. ఆమె జీవితం అవసరార్థులకే అంకితం. ఆమె ఓ ప్రపంచ శాంతిదూత, ఓ ఆపన్నహస్తం, స్వచ్ఛంద నేస్తం. ఆమె ఎవరో కాదు పేరులోనే తల్లిని ఇముడ్చుకున్న మహోన్నత మహిళ, మదర్ థెరిస్సా. అసాధారణ, అత్యుత్తమ శ్రేణి మహిళ మదర్ థెరిసా పేద బడుగు బలహీన వర్గాల శ్రేయస్సుకు పాటుపడిన కారణంగా ప్రపంచ దాతృత్వ గుణానికి ప్రతీకగా నిలిచిన నొబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరిసా వర్థంతి సందర్భంగా 2012 నుంచి ప్రతి ఏట 05 సెప్టెంబర్ రోజున "అంతర్జాతీయ దాతృత్వ దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ చారిటీ)" పాటించారని ఐరాస నిర్ణయించడం ముదావహం. సామాజిక బాధ్యతను తట్టి లేపడం, దాతృత్వ చర్యలకు ప్రేరణనివ్వడంతో పాటు మానవాళి ఎదుర్కొంటున్న పేదరికం, ఆకలి చావులు, విద్య, సంక్షేమం లాంటి సమస్యల పట్ల పౌర సమాజాన్ని జాగృత పరచడం లాంటి కార్యక్రమాలను ఈ వేదికగా నిర్వహిస్తున్నారు. చిన్న చిన్న సేవలు కూడా పెద్ద మార్పుకు నాంది పలుకుతాయని కూడా ప్రచారం చేయడం జరుగుతుంది. పేదరిక నిర్మూలన, పీడిత జనాల రక్షణ, ఆకలి కేకలకు అన్నం ముద్ద అందించడం, గాయపడిన గుండెలకు సాంత్వన కూర్చడం, సహానుభూతితో సమస్యలకు పరిష్కారం చూపడం లాంటి లక్ష్యంతో మదర్ థెరిసా తన జీవితాన్ని ఆసాంతం అవసర ప్రజా సేవకు అంకితం చేసారు. మదర్ థెరిసా జీవితం దాతృత్వ ఔదార్య స్ఫూర్తిని రగిలించడం జరుగుతోంది. అంతర్జాత దాతృత్వ దినం - 2025 ఇతివృత్తంగా "పేదరిక నిర్మూలనలో ప్రపంచ సంఘీభావం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది. 26 ఆగస్టు 1910 పుణ్య గడియల్లో స్కోప్జీ, మసిడోనియాలో జన్మించిన మదర్ థెరిస్సా అసలు పేరు "అగ్నెస్ గోంక్సహ బొజాక్సిహివూ". ఆమె 27 ఆగస్టు రోజున బాప్టిజమ్ స్వీకరించడం జరిగింది. చిన్నారి చిన్నతనంలా నుంచే మిషనరీల్లో సేవలు చేయడం ప్రారంభించింది. అవసరార్థులు, అనాధలు, దీర్ఘకాలిక రోగులకు సేవలు చేయడానికి 1928లో ఇంటిని వదిలి 'సిస్టర్స్ ఆఫ్ లొరెటో'లో చేరి ఇండియాలో సేవలు అందించడానికి అంకితం అయి పోయింది. నన్స్ విభాగంలో శిక్షణ అనంతరం కలకత్తాలోని పాఠశాలలో టీచర్‌గా 1931 నుంచి 1948 వరకు సేవలు అందించింది. ఈ కాలంలో పేదరికాన్ని చూసి చలించిపోయి, శాశ్వతంగా సేవామార్గాన్ని నిర్ణయించుకుంది. 1950లో "మిషనరీస్ ఆఫ్ చారిటీ, కలకత్తా"ను ఏర్పాటు చేసి ఒక సమూహాన్ని ఏర్పరచుకొని మురికి వాడడల్లో మగ్గుతున్న కడు పేదలకు స్వచ్ఛందంగా సేవలు చేయడం, విద్య బోధించం, ఆకలి తీర్చడం, రోగులకు ఉపశమన సేవలు చేయడం ప్రారంభించింది. తను నిర్మించిన మిషనరీ సామ్రాజ్యం 130కి పైగా దేశాలకు విస్తరించి లక్షలాది సేవకులకు కేంద్రంగా మారింది. ఇండ్లు లేని వీధి బాలలకు తానే అమ్మగా మారి సకల సపర్యలు చేసి, మానవతకు నిలువెత్తు రూపంగా నిలిచింది. మదర్ అమూల్య సేవలకు ప్రతిగా ప్రపంచ పౌర సమాజం పలు పురస్కారాలు ఆమెను వరించాయి. వాటిలో ప్రధానమైనవిగా భారత ప్రభుత్వ పద్మశ్రీ, జాన్ పోప్ శాంతి బహుమతి, కెన్నెడీ అవార్డు, జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ పురస్కారం, యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్, నోబెల్ శాంతి బహుమతి, భారత రత్న, ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్, అమెరికా గౌరవ పౌరసత్వం, కాంగ్రెషనల్ గోల్డ్ మెడల్ లాంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు ఉన్నాయి. ఐదు భాషల్లో అనర్గళంగా మాట్లాడగల మదర్ థెరిసా 1979లో నోబెల్ శాంతి పురస్కారాన్ని అందుకొని 2015లో పోప్ ఫ్రాన్సిస్ చేత "సేయింట్ థెరిసా ఆఫ్ కలకత్తా"గా గుర్తించబడింది. 05 సెప్టెంబర్ 1997 రోజున అమరత్వం పొందింది మథర్ థెరిసా. ఆమె వర్ధంతిని "అంతర్జాతీయ చారిటీ దినం"గా పాటించడం జరుగుతున్నది. పలు దేశాల్లో థెరిసా పేరున సంస్థలు, వీధులు, యూనివర్సిటీ, కాలేజీలు, పాఠశాలలు కూడా నెలకొల్పడం జరిగింది. మానవీయ సేవలకు తన జీవితాన్ని అంకితం చేయడమే కాకుండా లక్షల మంది సేవకుల దళాలను ఏర్పాటు చేసి అమూల్య సేవలను నిరు పేదలకు అందించి, నేటి తరానికి దారి దీపంగా నిలుస్తున్నారు.

# ఉపాధ్యాయులు... జ్ఞానజ్యోతి వెలిగించే దీపస్తంభాలు



భారత దేశంలో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు. ఈ సంప్రదాయం వెనుక ఉన్న మూలకారణం విశిష్ట తాత్వికుడు, గొప్ప విద్యావేత్త, భారతరత్న గ్రహీత, భారతదేశ రెండవ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం. ఆయన ఒకసారి "నా పుట్టినరోజు ప్రత్యేకంగా జరపాల్సిన అవసరం లేదు. కానీ నా సేవలను గౌరవించాలనుకుంటే ఆ రోజు దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోండి" అని అన్న సందర్భం నుండి ఈ దినోత్సవానికి శ్రీకారం చుట్ట బడింది. అప్పటి నుండి ప్రతి ఏడాది కోట్లాది మంది విద్యార్థులు తమ గురువులను సత్కరిస్తూ కృతజ్ఞతా నివాళి అర్పించడం ఆనవాయితీగా మారింది. భారతీయ సంప్రదాయంలో ఉపాధ్యాయుని స్థానం అత్యున్నతమైనది. తల్లిదండ్రులు మనకు జీవనాన్ని ఇస్తే ఉపాధ్యాయులు ఆ జీవనానికి జ్ఞానం, దిశా నిర్దేశం అందిస్తారు. శిష్యుడి ఆలోచన విధానాన్ని తీర్చిదిద్దడమే కాకుండా నీతి, నైతికతలు, విలువలు, సాంస్కృతిక వారసత్వాన్ని బోధించడం ఉపాధ్యాయుని గొప్ప కర్తవ్యంగా భావించ బడింది. అందుకే పురాణాలలో, శాస్త్రాలలో "గురు బ్రహ్మ:, గురు విష్ణుః, గురు దేవో మహేశ్వరః" అని ఉపాధ్యాయుని స్థాయిని దైవస్థాయిలో ఉంచారు. భారతీయ చరిత్రలో అనేక మంది గురువులు సమాజానికి దిశా నిర్దేశకులుగా నిలిచారు. చాణక్య చంద్రగుప్తుని సామ్రాజ్య నిర్మాతగా తీర్చిదిద్దాడు. ఆదిశంకరా చార్యులు భారతీయ ఆధ్యాత్మికతను పునరుద్ధరించారు. ఆధునిక యుగంలో జ్యోతిరావు ఫూలే, సావిత్రీబాయి ఫూలే విద్యా హక్కుల కోసం, ముఖ్యంగా స్త్రీలకు విద్యను అందించేందుకు పోరాడారు. స్వాతంత్ర్యం తర్వాత తొలి విద్యా మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యా విధానానికి బలమైన పునాదులు వేశారు. ఈ తరహా మహనీయుల కృషి ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని మరింత పెంచింది. ఈ రోజుల్లో భారతదేశంలో సుమారు 47 లక్షల మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ప్రతి సంవత్సరం వారి కృషిని గుర్తించి రాష్ట్రపతి చేత జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేస్తారు. 1962 నుండి ఈ సంప్రదాయం కొనసాగుతూ వస్తోంది. 2024లోనే 130 మంది ఉపాధ్యాయులు ఈ గౌరవాన్ని అందుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండీ ప్రతి సంవత్సరం పదుల సంఖ్యలో ఉపాధ్యాయులు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఒక విశిష్ట ఘట్టం. ఈ అవార్డులు ఉపాధ్యాయుల సమర్పణకు, శ్రమకు సామాజిక గుర్తింపును కల్పిస్తున్నాయి. అయితే నేటి యుగంలో ఉపాధ్యాయ వృత్తి సవాళ్లతో నిండినదే. సాంకేతిక పరిణామం వలన విద్యార్థులకు అపారమైన సమాచారం అందుబాటు లోకి వచ్చింది. కానీ ఆ సమాచారాన్ని సరైన జ్ఞానంగా మార్చి, ఉపయోగకర దిశలో వినియోగించడం నేర్పేది మాత్రం ఉపాధ్యాయుడే. తల్లిదండ్రులు, సమాజం నుంచి విద్యార్థులపై అధిక మార్కులు, ర్యాంకుల కోసం ఒత్తిడి పెరుగుతున్న క్రమంలో ఉపాధ్యాయులు కేవలం బోధకులే కాకుండా మానసిక బలాన్ని అందించే మార్గదర్శకులుగా మారాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో వనరుల కొరత, మౌలిక సదుపాయాల లేమి కారణంగా అక్కడి ఉపాధ్యాయులు అనేక పాత్రలు పోషిస్తూ విద్యా యజ్ఞాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. జాతీయ విద్యా విధానం 2020 ప్రవేశంతో పాఠ్య పద్ధతుల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుం టున్నాయి. విద్యార్థి కేంద్రిత బోధన, నైపుణ్యాభివృద్ధి, సృజనాత్మక ఆలోచనలపై దృష్టి పెట్టాల్సిన అవసరం వచ్చింది. ఈ కొత్త విధానాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు సరికొత్త శిక్షణలు పొందుతూ, సాంకేతిక వనరులు వినియోగిస్తూ ముందుకు సాగుతున్నారు. విద్యావేత్త డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం ఒకసారి "ఒక గొప్ప ఉపాధ్యాయుడు దేశ భవిష్యత్తును నిర్మించ గలడు. విద్యార్థి మనసులో మంట వెలిగించగల శక్తి గురువుకే ఉంటుంది" అన్నారు. మహాత్మా గాంధీ "విద్య అనేది మనిషి శరీర, మానసిక, ఆత్మిక పరిమాణాల సమగ్ర అభివృద్ధి" అని చెప్పిన మాట ఉపాధ్యాయుని పాత్రను మరింత స్పష్టంగా తెలియజేస్తుంది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు తమ గురువులను సత్కరించడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఒక సంప్రదాయంగా మారింది. విద్యార్థులు ఒక రోజు పాటు ఉపాధ్యాయుల పాత్రను పోషించడం ద్వారా గౌరవాన్ని వ్యక్తపరుస్తారు. ఇది గురువుల పట్ల కృతజ్ఞతా భావాన్ని మాత్రమే కాక, ఉపాధ్యాయ వృత్తి గొప్పదనాన్ని గుర్తు చేస్తుంది. సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందినా, కృత్రిమ మేధస్సు ఎంత విస్తరించినా ఉపాధ్యాయుని స్థానాన్ని మరెవ్వరూ భర్తీ చేయలేరు. యంత్రాలు సమాచారం అందించగలవు కానీ ఆ సమాచారాన్ని సద్వినియోగం చేసుకోవడం నేర్పేది మాత్రం ఉపాధ్యాయుడే. అందువల్ల ఉపాధ్యాయ దినోత్సవం కేవలం ఒక వేడుక కాదు. ఇది సమాజాన్ని జ్ఞానవంతం చేసి, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుల మహోన్నత సేవలకు సమాజం తరపున అర్పించే కృతజ్ఞతా నివాళి.

# గురుః సాక్షాత్ పరబ్రహ్మా!




ఒక సామాన్య మానవున్ని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేర్చగల ధీర మేధావి గురువు. తొలి అక్షరం దిద్దించడం, వ్యక్తిత్వ వక్రగుణాలను సవరిస్తూ, సన్మార్గాలను చూపుతూ, అత్యున్నత స్థాయికి ఎదిగే వరకు మన వెంట నిడిచి, వెన్నెముకలా నిలిచి, నిరాశలో ఆశల విత్తులు నాటుతూ, కొవ్వొత్తిలా తను కరిగిపోతూ రేపటి తరానికి దారి దీపంగా నిలుస్తూ, తడబడినపుడు ఊత కర్రగా మారగల మహోన్నత దైవ రూపం, నడిచే ఆదర్శాల నిధి గురువు మాత్రమే. పాఠ్యాంశాలను బోధిస్తూ, వెన్నుతట్టి నడక, నడతల్ని నేర్పుతూ, జ్ఞానోదయాన్ని కలిగించగల నిస్వార్థ జీవి ఉపాధ్యాయుడు. ఢిల్లీకి రాజైన సద్గురువుకు పాదాభివందనం చేసేది భాధ్యతగల శిష్యుడే. పెరిగే మొక్కకు ఊత కర్ర ఉపాధ్యాయుడు. భగవంతుడితో భక్తుడి సంబంధం లాంటిదే గురు శిష్యుల పరమ పవిత్ర సంబంధం. గురువులు సృష్టి కర్త వంటి వారు. విద్యార్థికి జ్ఞానాన్ని అందించి, కొత్త విషయాలను నేర్పించే పాత్రను పోషిస్తారు. గురువు మార్గ నిర్దేశనం చేస్తూ, మోక్షం వైపు నడిపిస్తారు. గురువు పరంధాముడు, అజ్ఞాన చీకట్లను చిదిమేసి జ్ఞానోదయం కలిగించే వారు. గురువు పరివర్తకుడు, భవిష్యత్తు తీర్చిదిద్దే మేధావి. ఉపాధ్యాయుడు రేపటి తరం నిర్మాతలు. తరగతి గదుల్లోనే జాతి నిర్మాణం జరుగుతుంది. గురువుకను నమ్మిన శిష్యుడికి ఎదురుండదు. గురువు ప్రాధాన్యాన్ని గుర్తించిన డా: సర్వేపల్లి రాధాకృష్ణన్ సూచన మేరకు తన పుట్టిన రోజును భారతదేశ "జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం (నేషనల్ టీచర్స్ డే)"గా పాటించడం 1992 నుంచి ఆనవాయితీగా మారింది. విజ్ఞానం, లోక జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, వివేకం, విద్యాబుద్ధులు, శాస్త్రీయ దృక్పథం, మంచి అలవాట్లు, ప్రేరణ కల్పించడం, పొరపాట్లను నిర్దయగా సవరించడం, కెరీర్ నిర్మించడం లాంటి బహుముఖీల లక్ష్యాలను మదిలో నింపుకొని తమ విధులను సక్రమంగా, పవిత్రంగా నిర్వహించే గురువులు శిష్యుల దృష్టిలో బ్రహ్మ సమానులే. పుస్తకాల్లో పాఠాలను మాత్రమే బోధించే వారు సాధారణ ఉపాధ్యాయులు. పాఠ్యాంశాలతో పాటు హృదయపూర్వకంగా విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే మహాముభావులు మాత్రమే సద్గురువులు. పిల్లల్లో దయ, కరుణ, ఉత్సుకత, ధైర్యం, ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ అనబడే విత్తులు నాటి నీడనిచ్చే మహా వృక్షాలుగా మార్చగల మహోన్నతులు సద్గురువులు. ఓపిక, బేషరతు త్యాగాల ప్రతిరూపం ఉపాధ్యాయులు. 05 సెప్టెంబర్ 1888 రోజున తికుత్తని, తమిళనాడులో మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన రాధాకృష్ణన్, చిన్నతనం నుంచే అత్యుత్తమ విద్యార్థిగా పేరు తెచ్చుకున్నారు. పాఠశాల విద్య అనంతరం మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో ఉన్నత విద్య పూర్తి చేశారు. అనంతరం మైసూర్ యూనివర్సిటీ, కలకత్తా యూనివర్సిటీల్లో అధ్యాపకుడిగా సేవలు అందించిన పిదప ఆంధ్ర, ఢిల్లీ, బెనారస్ హిందూ యూనివర్సిటీలకు విసిగా సేవలు అందించారు. ఆక్సఫర్డ్, చికాగో యూనివర్సిటీలతో పాటు యునెస్కో బోర్డులో తన సత్తా చాటారు. డా: రాధాకృష్ణన్ అద్వితీయ మేధో సంపత్తిని గుర్తించిన భారత ప్రభుత్వం 1952లో భారత ఉపరాష్ట్రపతిగా ఎంపిక చేసుకోవడం జరిగింది. అదే క్రమంలో 1954లో దేశ రెండవ రాష్ట్రపతిగా 1967 వరకు విశేష సేవలు అందించారు. యునెస్కో చొరవతో 05 అక్టోబర్‌న ప్రతి ఏట "ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం" జరుపుకోవడం కూడా కొనసాగుతున్నది. 1954లో భారత రత్న స్వీకరించిన రాధాకృష్ణన్, 16 పర్యాయాలు నోబెల్ సాహిత్య బహుమతికి, 11 సార్లు నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయ్యారు. ఫిలాసఫీలో లోతైన పరిజ్ఞానం కలిగిన రాధాకృష్ణన్, తన జీవితకాలంలో పలు ప్రఖ్యాత పుస్తకాలు రచించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం వేదికగా మన గురువులకు కృతజ్ఞతలు తెలపడం, వారి దీవెనలు పొందడం, వారిని మనస్ఫూర్తిగా సన్మానించడం, సుదూర ప్రాంతాల్లో ఉన్న ఉపాధ్యాయులకు ప్రేమపూర్వకంగా ఉత్తరాలు రాయడం, విద్యాలయాల్లో సెల్ఫ్ గవర్నమెంటు డే పాటించడం, వారి సేవలను కొనియాడడం, విద్యాలయాల్లో పలు పోటీలను నిర్వహించడం లాంటి పలు కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది. నిస్వార్థ ప్రేమ, గౌరవం, కృతజ్ఞతలను తెలు పడానికి ఈ వేదిక ఎంతగానో ఉపకరిస్తుందని గమనించాలి. కంచే చేనును మెసినట్లు, నేటి ఉపాధ్యాయుల్లో కొందరు విధులను నిర్లక్ష్యం చేయడం, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడం, విధి నిర్వహణలో ఆల్కహాల్ సేవించడం, కాలక్షేపం కోసం ఉద్యోగం చేయడం, అభ్యంతరకరంగా ప్రవర్తించడం అత్యంత విచారకరం. రేపటి తరం నిర్మాతలుగా నేటి ఉపాధ్యాయులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి డిజిటల్-ఏఐ తరగతి గదుల్లో సాంప్రదాయంతో బోధనలు చేయడానికి ముందుకు రావాలని, ప్రతి విద్యార్థిని బాధ్యతగల పౌరులుగా మార్చడానికి కృషి చేయాలని కోరుకుందాం.

## పత్రికల పంపిణీలో పేపర్ బాయ్స్ నిరుపమాన సేవలు

ఆధునిక సమాజంలో ప్రింట్ మీడియా కన్నా సోషల్ మీడియా వేగవంతంగా ముందుకు సాగుతోంది. స్మార్ట్ ఫోన్ లు అందుబాటు లోకి వచ్చాక డిజిటల్ యుగంలో సామాజిక, డిజిటల్ మాధ్యమాల ప్రభావం నానాటికీ పెరిగిపోతోంది. అప్డేట్స్ తో వాట్సాప్, ఫేస్ బుక్, ట్విట్టర్ మాధ్యమాల ద్వారా విషయం వెనువెంటనే బహిరంగం అవుతుండగా, ప్రింట్ మీడియా వాటి వేగానికి, టెక్నిక్స్ కు పోటీ పడలేక పోతోంది. లైవ్ వీడియోలతో వస్తున్న అంశాలు, బ్రేకింగ్ న్యూస్ కోసం అధిక సంఖ్యాకులు ప్రభావితులు అవుతున్నారన్నది వాస్తవం. నేటి వార్త తెల్లవారి మార్కెట్ లోకి ప్రచురితం అయి వచ్చే సాంప్రదాయ పత్రికల కోసం చాలామంది ఎదిరి చూసే పరిస్థితులు కనిపించడం బాధాకరం. ఒకనాడు నిత్యం ప్రపంచంలో ఏ మూల ఏమి జరిగినా ప్రజలకు వార్తా పత్రికలు మాత్రమే చెరవేసేవి. ప్రభుత్వాలకు ప్రజలకు మధ్యవర్తిత్వం వహిస్తూ వారథులుగా పత్రికలు పని చేసేవి. ప్రజా బాహుళ్యానికి నిత్యం చైతన్య పరుస్తూ, ప్రగతికి బాటలు వేసేవి. అలాంటి స్థితిలో పత్రికలు పాఠకునికి చేర్చడంలో కీలక పాత్ర పోషించింది నిస్సందేహంగా పేపర్ బాయ్. తొలి పేపర్ బాయ్‌గా గుర్తింపు పొందిన బార్నీ ఫ్లాహెర్టీ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా సెప్టెంబరు 4న అంతర్జాతీయ పేపర్‌బాయ్ దినోత్సవం జరుపుతున్నారు. నియమిత స్థలాల్లో పాత్రికేయులు ఆహరహం శ్రమించి, సేకరించి పంపిన వార్తలను ఉప సంపాదకులు సరిచేసి, సంపాదకుని ఆమోద ముద్ర పడిన తర్వాత ముద్రణకు రంగం సిద్ధం చేశాక, ముద్రిత దిన పత్రికలను పాఠకులకు చేరవేయడంలో పేపర్‌బాయ్‌ల కష్టాలు, ఇబ్బందులు అందరికీ తెలిసిందే.

శుక్రవారం 5 సెప్టెంబర్ 2025
http://www.agnidharanews.com
అగ్నిధార

# కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

**లాభాల్లో వాటా బోనస్ ను చెల్లించాలి.**
**ప్రతి నెలా 7వ తేది లోపు జీతాలు చెల్లించాలి.**
**సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ డిమాండ్.**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** సింగరేణిలో దాదాపు ముప్పై వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు వివిధ విభాగాల్లో గత పదిహేను సంవత్సరాల నుండి పని చేస్తున్నారని, వీరికి కనీస వేతనాలు, సౌకర్యాలు అమలు కావడం లేదని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం. ఎ. గౌస్ పేర్కొన్నారు. గురువారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని సెక్టార్ వన్ కమ్యూనిటీ హాల్ మరియు బి గెస్ట్ హౌస్ వద్ద కాంట్రాక్టు కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకొని అనంతరం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత నాలుగు నెలల క్రితం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల సలహా మండలిలో సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలని నిర్ణయించి అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన సిఫారసులను ఆమోదించి తక్షణమే సింగరేణి లో అమలుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు తక్షణమే వేతనాలను పెంచాలని, లాభాల్లో వాటా నిర్ణయించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కనీస వేతనాలను నిర్ణయించిన వాటిని ఆమోదించి అమలు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని ఆయన ఆరోపించారు. దీని మూలంగా



సింగరేణి కాంటాక్ట్ కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు. ఈ ఆర్థిక సంవత్సరం సింగరేణికి వచ్చిన లాభాల నుండి కాంట్రాక్టు కార్మికులకు చెల్లించబోయే వాటాను నిర్ణయించి అమలు చేయాలని కోరారు. ఆగస్టు నెల నుండి డిసెంబర్ లోగా ఈ ఎస్ఐ అమలు చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పిన యాజమాన్యం తక్షణమే ఈఎస్ఐ అమలుకు కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులందరికీ తప్పనిసరిగా ఏడవ తేదీలోపు వేతనాలు చెల్లించేందుకు సింగరేణి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు వర్కర్స్ పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్ అమలు ఘనత కాంగ్రెస్ పార్టీదే

**విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లండి ..**
**టిపిసిసి ప్రధాన కార్యదర్శి, పెద్దపల్లి పార్లమెంట్ ఇంచార్జ్, కాశిపాక రాజేష్..**



కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే ఇచ్చిన తెలంగాణను అప్పుల పాలు చేసి పదేళ్ల పాటు అధికారంలో ఉండి కేసీఆర్ సబండవర్ణాలకు అన్యాయం చేయడమే కాకుండా బీసీలను అనగదొక్కారని టిపిసిసి ప్రధాన కార్యదర్శి కాశి పాక రాజేష్ గురువారం ఒక పత్రిక ప్రకటనలో ఆరోపించారు. కేసీఆర్ చేసిన బిసి బిల్లు బిసిలకు మరణ శాసనం అయ్యింది అన్నారు. బిసి కులఘనన చేసి పకడ్బందీగా బిసి బిల్లు తెచ్చి బిసిలకు రాజకీయ సుస్థిర స్థానం కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీ ది అన్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే ఆశయాలకు అనుగుణంగా జనాభా ప్రాతిపాదికన వాటా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుంది అన్నారు. కుల గణన చేపట్టాము.. బీసీ కమిషన్ వేశాము.. పారదర్శకంగా బిసి కమిషన్ వేసి లెక్కలు తేల్చాం అన్నారు. అసెంబ్లీ, మండలి లో బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు చేస్తూ బిల్లు చేసాము అన్నారు..ఆ బిల్లులు గవర్నర్ రాష్ట్రపతికి పంపి ఆలస్యం అవుతుంటే కోర్ట్ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ చేయమంటే ఆర్డినెన్స్ తెచ్చాము అని గుర్తు చేశారు..ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదించకపోవడంతో అసెంబ్లీ లో మళ్ళీ రిజర్వేషన్లు పరిమితి ఎత్తివేస్తూ 42 శాతం బిసి రిజర్వేషన్లు చేసి బిల్లు పాస్ చేసి చూపించాము అన్నారు.

కుల గణన, బిసి కమిషన్, క్యాబినెట్ సమావేశంలో ఆమోదం, అసెంబ్లీ ఆమోదం, ఆర్డినెన్స్, ఇప్పుడు అసెంబ్లీ లో రిజర్వేషన్లు పరిమితి ఎత్తివేస్తూ బిల్లు ఇన్ని రకాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేసింది అన్నారు..తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రి వర్గం పూర్తి చిత్తశుద్ధితో పని చేస్తుంది.

ఎన్ని రాజకీయ, సాంకేతిక, న్యాయ పరమైన అడ్డంకులు వచ్చినా ఎదుర్కొని నేడు బిసిల రిజర్వేషన్లు విషాయంలో అన్ని చేసి చూపించాం అన్నారు..

మన చిత్తశుద్ధి, పని తనాన్ని కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో, మండలాల్లో, జిల్లాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి.

బిసి రిజర్వేషన్లు హీరో గా కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ, ఖర్గే, రేవంత్ రెడ్డిలను బీసీల గుండెలలో గుర్తుండేలా ప్రచారం చేయాలన్నారు.

20 నెలల కాంగ్రెస్ పాలనలో చేసిన ప్రజా పాలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, బిసి రిజర్వేషన్లు పెద్దఎత్తున కింది స్థాయి వరకు తీసుకువెళ్లాలని సూచించారు.

## ఆపిల్ కిడ్స్ పాఠశాలలో ఘనముగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలు

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** స్థానిక మండల కేంద్రంలో గల ఆపిల్ కిడ్స్ పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ 137వ జయంతి వేడుకలను నేడు పాఠశాలల జరుపుకోవడం జరిగింది సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు ఉపాధ్యాయ వృత్తి నుండి అంచలంచలుగా ఎదిగి ఉపరాష్ట్రపతిగా రాష్ట్రపతిగా దేశానికి సేవలు అందించారని విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ చదువు వెంకట్ రెడ్డి తెలియజేశారు ఉపాధ్యాయ వృత్తి అనేది ఎంతో పవిత్రమైనదని సమాజం మొత్తం కూడా ఉపాధ్యాయ లను గౌరవిస్తుందని మాతృదేవోభవ పితృదేవోభవ ఆచార్యదేవోభవ అని అంటారు తల్లిదండ్రుల తర్వాత పూజించబడేటువంటి ఏకైక వ్యక్తి



ఆచార్యులే అందుకే ఆచార్య వృత్తి అనేది ఎంతో పవిత్రమైనది దీనిని కాపాడేటువంటి బాధ్యత మనందరి పైన ఉందని చిన్నారులకు తెలియపరిచారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రిన్సిపాల్ రాజమణి భూలక్ష్మి గౌతమి ప్రియాంక జేబా నాగరాణి రాణి పాల్గొన్నారు

## కంటి చూపు కోల్పోయిన వ్యక్తి ఇంటి నిర్మాణానికి చేయూత

**ఉప్పల చారి ట్రబుల్ ట్రస్టు ఛైర్మెన్ ఉప్పల వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** ఆమనగల్ మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన సిరిగాని లాలయ్య అనే వ్యక్తి ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో రెండు కండ్లు నరాలు పోగొట్టుకోవడం తో రెండు కళ్ళలో కంటి చూప్పు మందగించింది ఈ విషయం స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న పోలేపల్లి గ్రామ వాసి మాజీ ఎంపిటిసి దోనదుల కుమార్ కంటి చూపు కోల్పోయిన లాలయ్య భార్య కుటుంబ సభ్యులతో తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ దృష్టికి తీసుకుపోవడంతో లాలయ్య ఇంటి నిర్మాణం కోసం సహాయం చేయమని అడగడం జరిగింది లాలయ్య ఇల్లు నిర్మానించేటప్పుడు ఉప్పల చారిబుల్ ట్రస్టు ద్వారా ఇసుక స్టీలు సిమెంటు లాలయ కుటుంబానికి సహకారం చేస్తానని ఉప్పల వెంకటేష్ చెప్పారు లాలయ్య




కుటుంబ సభ్యులతో పాటు పోలపల్లి గ్రామస్తులు వెంకటేష్ కు కృతజ్ఞతలు తెలిపారుఈ కార్యక్రమంలో తలకొండపల్లి సర్పంచుల సంఘం అధ్యక్షులు గోపాల్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ గుమ్మకొండ రాజు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సోమరాజు, శ్రీరాములు, లాలయ్య, యాదయ్య, వెంకటయ్య, శ్రవణ్, గ్రామ బిఆర్ఎస్ యువజన నాయకులు గ్రామ పెద్దలు గ్రామ యువకులు పాల్గొన్నారు

## విఘ్నేశ్వరుడి ఘాటును సందర్శించిన ఎమ్మెల్యే

**నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన**

**అగ్నిధారన్యూస్ సుల్తానాబాద్** సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో గురువారం రోజున పెద్ద చెరువు విఘ్నేశ్వరుని ఘాటును స్థానిక నాయకులు అధికారులతో కలిసి వినాయక నిమజ్జన ఏర్పాట్లను పెద్దపల్లి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...మున్సిపల్ పరిధి తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల విఘ్నేశ్వరుడి మంటపాలా నిర్వాహకులు శాంతియుతంగా తమ ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించి ఎలాంటి గొడవలు లేకుండా మధ్యాని కి దూరంగా ఉండి ప్రమాదాలు జరగకుండా విద్యుత్ తీగలను గమనిస్తూ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా క్రమ పద్ధతిన చక్కటి వాతావరణం లో భజనలతో ర్యాలీలు నిర్వహించాలని నిర్దేశించిన సమయంలో విగ్రహాలను మండపాల నుంచి తరలించి గ్రామంలో ర్యాలీ నిర్వహించి సమీప చెరువుకు తరలించి నిమజ్జనం చేపట్టాలని సూచించారు. చెరువు కట్ట వద్ద అన్ని వసతులను ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్ క్రాంతి తోపాటు వైద్యము మంచినీటి సదుపాయం అందుబాటులో ఉంటాయని అలాగే చెరువు సమీపాన గణపతి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు భారీ క్రేన్ ను ఏర్పాటు చేశామని కట్టపై భారీ కేట్లు ఏర్పాటు చేస్తున్నామని చెరువులో సైతం గజ



ఈత గాళ్ళు అందుబాటులో ఉంటారని చిన్నపిల్లలు వృద్ధులు నిమజ్జనం చేసే సమయంలో విగ్రహాలతో ఉండకుండా నిర్వాహకులు జాగ్రత్తలు పడాలని సూచించారు. భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామని అలాగే మున్సిపల్ సిబ్బంది సైతం అందుబాటులో ఉంటారని ప్రశాంతంగా వేడుకలు ముగించు కోవాలని తెలిపారు. ఎలిగేడు మండల కేంద్రంలో శివపల్లి సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో గురువారం రోజున పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోసీఐ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్,ఎస్సై శ్రావణ్ కుమార్,ఏఈ రాజ్ కుమార్ సెక్షన్ ఆఫీసర్ రాజు, పోలీస్ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ముమ్మరంగా కొనసాగుతున్న 100 రోజుల కార్యచరణ పనులు



**అగ్నిధార న్యూస్,( రామగుండం):** వంద రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో ఇందిరా నగర్ లో క్లీన్ లీ నెస్ టార్గెట్ యూనిట్ గా గుర్తించిన గార్బేజ్ వల్నరెబుల్ పాయింట్ శుభ్రం చేశారు. నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి కార్యక్రమాన్ని పర్యవేక్షించగా సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ , వార్డు అధికారి సాయి ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ సానిటరీ జవాన్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాథునికి ప్రత్యేక పూజలు



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కమాన్ పూర్ మండల కేంద్రంలోని గోకుల్ నగర్ కురుమ సంఘం భవనం వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద మహిళలు కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని గణనాథుడిని పూజించారు.


## కుటుంబ కలహాలతో ముగ్గురు పిల్లని చంపి తండ్రి ఆత్మహత్య



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం బోయలపల్లి గ్రామానికి చెందిన గుత్తా వెంకటేశ్వర్లు వెల్దండ మండలం పెద్దాపూర్ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడడం జరిగింది. అంతకు ముందు ఉప్పునుంతల మండలం సూర్య తండా సమీపంలో తండ్రి వెంకటేశ్వర్లు మోక్షిత(08), వర్షిణి(06) ,శివ ధర్మ(4) వీరి పై పెట్రోల్ పోసి చంపడం జరిగింది. కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో పెద్దమ్మాయి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. కుటుంబ కలహాలే కారణమంటు డి ఎస్ పి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, కుటుంబ కలహాల వల్ల ఓ తండ్రి తన ముగ్గురు చిన్నారులను చంపి తాను ఆత్మహత్య చేసుకోవడానికి కుటుంబ కలహాలే కారణం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో, వెల్దండ మండల సి ఐ విష్ణువర్ధన్ రెడ్డి ఎస్ఐ తది తరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**ట్రస్టు ఛైర్మెన్ ఉప్పల వెంకటేష్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**తలకొండపల్లి మండలంలోని చంద్రధన గ్రామానికి చెందిన వడ్డే వెంకటమ్మ అనారోగ్యంతో బాధపడుతు మరణించడం జరిగింది స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా బాధిత కుటుంబానికి ప్రగడ సానుభూతి తెలుపుతూ 3000 రూపాయలు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు కుటుంబ సభ్యులకి అండగా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఉప సర్పంచ్ సొల్లు సుధాకర్,మాజీ సర్పంచ్ బేగరి రాములు, బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మొక్తాల జంగయ్య గౌడ్,యాదవ సంఘం అధ్యక్షులు చెన్నయ్య,కటికల శేఖర్ యాదవ్,శ్యాంసుందర్ రెడ్డి,నిదురం అశోక్, బాలకిష్టయ్య, అజయ్,అంకుషనిదురం యాదయ్య, క్రిష్ణ,మల్లేష్, నరేష్,బాల్ రాజ్,శివ రాజు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**– ఏడుగురు పేకాట రాయుళ్ళ అరెస్ట్.11,840 /- రూపాయల నగదు,07 మొబైల్ ఫోన్ లు స్వాధీనం**

**అగ్నిధార న్యూస్ గోదావరిఖని టౌన్ సెప్టెంబర్ 04** గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి కి వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ గాంధీ నగర్ (వంక బెండు) ప్రాంతం లోని ఒక ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరం పై దాడి చేసి, పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 11,840/- రూపాయల నగదు,07 సెల్ ఫోన్ లు పేక ముక్కలు స్వాధీనం చేసుకోవడం జరిగింది. పట్టుబడిన వారిని తదుపరి విచారణ నిమిత్తం గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేశారు.

# గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

**భక్తులకు సౌకర్యాలు కల్పించాలి**

**అధికారులకు ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి ఆదేశం**



**అగ్ని ధారా: న్యూస్ /సెప్టెంబర్/3** మానకొండూరు నియోజకవర్గం వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం మానకొండూర్ గ్రామపంచాయతీ ఆవరణలో నిమజ్జనం ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, రాజకీయ పక్షాల నాయకుల తో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు అధికారులను ఆదేశించారు.సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు లేక్ వ్యూ వద్ద మూడు పెద్ద క్రేన్లతో పాటు చిన్న క్రేన్లను అందుబాటులో ఉంచుతున్నట్లు ఆయన చెప్పారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. వినాయక నిమజ్జనానికి విచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. మంచినీరు,వైద్య సేవలు కల్పిస్తామని ఆయన చెప్పారు. అన్ని శాఖల అధికారులు ఇక్కడే అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తారని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్,డీపీఓ, మానకొండూర్ ఎంపీడీవో, తహశీల్దార్, వివిధ శాఖల అధికారులతోపాటు మానకొండూరు మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, రేమిడి శ్రీనివాసరెడ్డి, తాళ్లపల్లి నరేష్, మడుపు ప్రేమ్ కుమార్, కొండ సురేష్, ఇర్ఫాన్, మాతంగి సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల కృషి వల్లే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది





**కార్యకర్తలకు ఎల్లపుడు**

**అండగా కాంగ్రెస్ పార్టీ**

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** ఆమనగల్లు పట్టణములోనీ శ్రీలక్ష్మి గార్డెన్ లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశనికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమని అన్నారు. కార్యకర్తల కృషి వల్లే కల్వకుర్తి నియోజకవర్గంలో 10 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ జెండా ఎగిరిందని గుర్తు చేశారు.గత ప్రభుత్వంలో నాయకులు ఎన్ని కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేసినా మొక్కవోని ధైర్యం, ఆత్మ విశ్వాసంతో కాంగ్రెస్ పార్టీని గెలిపించారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఆపదలో ఉంటే ఎప్పుడైనా తాను అండగా ఉంటానన్నారు.ముఖ్య %%రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం నిధులు ఖర్చు చేస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని దిశానిర్దేశం చేశారు. త్వరలో గ్రామాల్లో కమిటీలు వెయ్యాలి అని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యవర్గ సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరి భాస్కర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు,మాజీ మండల అధ్యక్షుడు మంగ్లీ రాములు,మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ అనిత విజయ్, మార్కెట్ డైరక్టర్లు వస్పుల శ్రీశైలం, మాజీ ఎంపీపీ దనంజయ్య, మాజీ వైస్ ఎంపీపీ ఆనంత రెడ్డి,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు వస్పుల శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ నిట్ట నారాయణ,పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, ఐ ఎన్ టి యూ సి అధ్యక్షులు ఎంగాలి ప్రసాద్, ఎన్ యూ ఐ కార్యదర్శి పరీద్,వివిధ గ్రామాల సర్పంచులు, వార్డ్ సభ్యులు పట్టణ ముఖ్య నాయకులు ఆదివాసీ రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్,సత్యం,వేంకట్ రెడ్డి,ఖాదర్,శ్రీధర్,కాలే మల్లయ్య, అలీం, దుద్దు కృష్ణ, విజయ్ రాథోడ్,కొప్పు సుదర్శన్, ద్యాసాని బాల్ రెడ్డి, రమణరెడ్డి, మల్లేష్ నాయక్,శ్రీను నాయక్, కొప్పు సాయిలు, కొప్పు శ్రీశైలం, కొప్పుయాదయ్య,కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

# కార్మికుల హక్కుల సాధన లో ఏఐటియుసి ముందుంటుంది.

**- ఏఐటియుసి పై అనవసరపు విమర్శలు మానుకోండి.**

**- ఏఐటియుసి లో చేరిన ఓసిపి 5 ఉద్యోగులు.**

**- కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించిన ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్.**




**అగ్నిధార న్యూస్ గోదావరిఖని టౌన్ సెప్టెంబర్ 04** సింగరేణి లో కార్మికుల హక్కుల సాధన కోసం, వారి సంక్షేమం కోసం ఏఐటియుసి ముందుంటుందని, కొన్ని కార్మిక సంఘాలు ఏఐటియుసి పై అనవసరపు విమర్శలు చేస్తూ కార్మికుల ను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఇది సరైన విధానం కాదని విమర్శలు చేయడం మానుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని ఓసిపి 5 చెందిన ఉద్యోగులు సామెల సుధాకర్ (ఫిట్టర్), తోట లక్ష్మయ్య (జనరల్ అసిస్టెంట్), మంథని మల్లేష్ ( జనరల్ అసిస్టెంట్) లు ఏఐటియుసి ప్రాజెక్టు కార్యదర్శి కామ్రేడ్ గుర్రం ప్రభుదాస్ ఆద్వర్యంలో ఏఐటియుసి లో చేరిన సందర్భంగా ఎల్లా గౌడ్ కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించిన అనంతరం మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి సింగరేణి లో 1942 లో ఆవిర్భవించిందని, ఇది కార్మికులు తమ హక్కులను సాధించుకోవడం కోసం ఏర్పాటు చేసుకున్న మొట్టమొదటి కార్మిక సంఘం అని ఆయన అన్నారు. ఏఐటియుసి నాటి నుండి నేటి వరకు కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారం కోసం అనేక పోరాటాలు, సమ్మెలు చేసి హక్కులు సాధించిన చరిత్ర ఏఐటియుసి కి ఉందని ఆయన అన్నారు .అదే విధంగా సింగరేణి లో గత పది సంవత్సరాలుగా అధికారం లో ఉన్న టిబిజికెఎస్ యూనియన్ రాజకీయ జోక్యం, పైరవీల వల్ల కార్మికుల సమస్యలు పరిష్కారం కాక పెండింగ్ లో ఉండడం వల్ల ఏఐటియుసి యూనియన్ కార్మికుల పక్షాన నిలబడి సింగరేణి లో గుర్తింపు సంఘం ఎన్నికలు పెట్టాలని ఇతర యూనియన్ లు యాజమాన్యం సంకలో సొచ్చి అడ్డుకున్న ఏఐటియుసి కోర్టు కు వెళ్లి సింగరేణి లో గుర్తింపు సంఘం ఎన్నికలు పెట్టించడం జరిగిందని ఆయన అన్నారు. ఏఐటియుసి 2023 లో జరిగిన ఎన్నికల్లో ఏడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి యాజమాన్యం దాదాపు పది నెలలు ఆపి సెప్టెంబర్ 2024 లో గుర్తింపు పత్రం ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు. ఏఐటియుసి వెంటనే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జరిపే స్ట్రక్చర్, జేసిసి సమావేశాలు నిర్వహించాలని యాజమాన్యం కు లేఖ రాయడం జరిగిందని ఆయన అన్నారు. యాజమాన్యం 2024 నవంబర్ లో, మార్చి 2025 జూన్ 2025 లో నిర్వహించిన సమావేశాల్లో కార్మికుల కు చెందిన అనేక సమస్యల్ని పరిష్కరించాలని కోరడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కొన్ని సమస్యలను పరిష్కరించేందుకు ఒప్పుకుందని, మరి కొన్ని కమిటీలు వేసి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని, కొన్ని సమస్యలను ప్రభుత్వం ద్వారా పరిష్కరించేటివి ఉన్నాయని వాటిని కూడా ప్రభుత్వం దృష్టికి సింగరేణి యాజమాన్యం తీసికెళ్ళి పరిష్కారం చేయాలని కోరడం జరిగిందని, ముఖ్య మైన సమస్యలగు స్వంత ఇంటి పథకం అమలు, మారుపేర్లు, విజిలెన్స్ సమస్యల పరిష్కారం, ఆదాయపు పన్ను, కొత్త గనులు రావడం కోసం తదితర అంశాలపై ప్రభుత్వం పై, యాజమాన్యం పై గుర్తింపు సంఘం గా ఏఐటియుసి ఒత్తిడి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కొన్ని కార్మిక సంఘాలు ఏఐటియుసి కార్మికుల కు చేస్తున్న పనులను చూసి ఓర్వలేక పస లేని ఆరోపణలు, విమర్శలు చేయడం సరైంది కాదని ఆయన విమర్శించారు. ఏఐటియుసి యూనియన్ చరిత్ర కలిగిన సంఘం అని, కార్మికుల హక్కుల సాధన లో గత ఎనబై సంవత్సరాల కు పైగా ఎందరో నాయకులు అనేక పోరాటాలు చేసి తమ జీవితాలను త్యాగం చేయడం వల్ల వారి వారసత్వం లో అనేక మంది నాయకులు కార్మిక వర్గ శ్రేయస్సు కోసం కృషి చేస్తూ ఏఐటియుసి ని ముందుకు నడిపిస్తున్నారని ఆయన అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్, సహాయ కార్యదర్శి రంగు శ్రీను లు చేరిన వారికి కండువాలు కప్పగా, నాయకులు గండి ప్రసాద్, బోగ సతీష్ బాబు, దొంత సాయన్న, ఎం. చక్రపాణి, బండి మల్లేష్, దాసరి శ్రీనివాస్, భక్తి శ్రీనివాస్, బ్రహ్మ చారి, గొడిశెల నరేశ్, అజీం పాషా, ఎరవెల్లి రాజయ్య, కలవేణ రాజేష్, విజయ్, దేవేందర్ రెడ్డి, రమేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు

## భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**

**సింగరేణి భూ సేకరణపై అధికారులతో సమీక్ష.**




**అగ్నిధార పెద్దపల్లి, సెప్టెంబర్-04:**సింగరేణి మైనింగ్ సంబంధించి పెండింగ్ భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సింగరేణి భూ సేకరణ పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, రామగిరి మండలం బుధవారం పేట గ్రామంలో సింగరేణి ఆర్ జి 2 ఓపెన్ కాస్ట్ మైనింగ్ కోసం 86 ఎకరాలు సేకరించాల్సి ఉండగా 76 ఎకరాలకు అవార్డు పాస్ చేయడం జరిగిందని, మిగిలిన 10 ఎకరాలకు 10 రోజులలో అవార్డు పాస్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆర్జి 3 సంబంధించి లద్నాపూర్ గ్రామంలో పోచమ్మ ఆలయ పనులు సెప్టెంబర్ 10 నాటికి పూర్తి చేయాలని అన్నారు. ఆర్జి 2 పరిధిలో పెద్దంపేట గ్రామంలో ఎకరం భూమికి పరిహారం, అందులో ఉన్న నిర్మాణాలకు సైతం పరిహారం ఆదేలా చూడాలని అన్నారు.ఆర్జి 1 పరిధిలో సుందిళ్ల గ్రామంలో సింగరేణి లీజ్ భూమి ఉన్న రైతులకు పరిహారం త్వరగా రిలీజ్ చేయించాలని అన్నారు .ఈ సమావేశంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, సింగరేణి ఆర్జి 1, ఆర్జి 2,ఆర్జి 3 మేనేజర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ డి ఆర్ నిధులను నిర్ణీత కాలంలో ఖర్చు చేయాలి కలెక్టర్




**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:**గత ఏడాది 24-25 ఆర్థిక సంవత్సరంలో వనపర్తి జిల్లాలో భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాలకు కేంద్ర విపత్తు నిర్వహణ ద్వారా మంజూరు అయిన 3.00 కోట్ల నిధులను ఖర్చు చేసి యు.సి లు సిద్ధం చేసి పంపించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. గత వర్షం వరదల వల్ల ఎక్కడెక్కడ నష్టం వాటిల్లిందొ వాటికి మరమ్మతుల కొరకు ఖర్చు చేసిన బిల్లులు సిద్ధం చేయాలన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖ, రోడ్డు - భవనాలు , సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, నీటిపారుదల , మున్సిపాలిటీ శాఖలకు సంబంధించిన నష్టాలు, చేపట్టిన మరమ్మతు పనులను కలెక్టర్ సమీక్షించారు. ఎడతెరపి లేని వర్షాల వల్ల డ్యామేజ్ అయిన అంగన్వాడి భవనాలు, రోడ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మహిళా సంఘ భవనాలు, మిషన్ భగీరథ ట్యాంకులు తదితర మరమ్మతుల కోసం కేంద్ర విపత్తుల నిర్వహణ శాఖ ద్వారా రూ. 3 కోట్ల నిధులను కేటాయించడం జరిగిందని, వాటిని సకాలంలో సద్వినియోగం చేసుకొని యుటిలైజేషన్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందన్నారు.పనులు ఎంత మేరకు పూర్తయ్యాయి, ఎన్ని పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెలాఖరి వరకు పనులను సంపూర్ణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడెక్కడ ఎంత నష్టం జరిగిందో నివేదిక ఇవ్వాలని వాటికి సంబంధించిన మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో విద్యాశాఖ అధికారి మహమ్మద్ గని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, మున్సిపాలిటీ కమిషనర్లు, ఆర్ అండ్ బి అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, డి.సెక్షన్ సూపరింటెండెంట్ మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులే దేశ భవిష్యత్తు శిల్పులు

**పాఠశాల ఉపాధ్యాయులే నిజమైన గురువులు**

**మన మార్గదర్శకుడు సర్వేపల్లి**

**ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి**




**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** దేశ భవిష్యత్తు తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, తపస్విని కిడ్స్ ప్లే స్కూల్ ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులు పాఠశాలలో నిర్వహించిన రాధాకృష్ణ పూజ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు బోధించే వ్యక్తి మాత్రమే కాదు, విద్యార్థుల జీవితాలకు మార్గదర్శి, సమాజానికి దీపస్తంభం" అని పేర్కొన్నారు.స్కూల్ ఉపాధ్యాయులే నిజమైన గురువులని ఆయన స్పష్టం చేశారు. ఉపాధ్యాయుడు విద్యార్థి మధ్య ఉండే అనుబంధం సమాజ అభివృద్ధికి దోహదం చేస్తుందని రామకృష్ణారెడ్డి తెలిపారు. నాటి ఉపాధ్యాయులు గాని నేటి ఉపాధ్యాయులు గాని, వారి బాధ్యత, విలువ ఎప్పటికీ తగ్గదని అన్నారు.సర్వేపల్లి రాధాకృష్ణ విశిష్టతను గుర్తుచేసుకుంటూ, ఆయన విద్యావేత్తగా, తాత్వికుడిగా, రాష్ట్రపతిగా దేశానికి అందించిన సేవలు అపూర్వమని రామకృష్ణారెడ్డి అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజు పాఠశాలకు సాధారణ సెలవు దినం కావడంతో ముందుగానే తపస్విని పాఠశాల చిన్నారులు తమ గురువులకు గురువు పూజ నిర్వహించి జ్ఞాపికలను అందజేశారు, ఈ కార్యక్రమంలో పాఠశాల చిన్నారులు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బిజినెస్


# బంగారం ధరలకు రెక్కలు

భారతీయులకు బంగారం అంటే ఎంత ఇష్టమో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తమ స్థోమతకు తగినట్లుగా ఎంతో కొంత బంగారం కొనుగోలు చేస్తుంటారు. దీంతో ఏడాది పొడవునా బంగారానికి గిరాకీ ఉంటుంది. ఇటీవలి కాలంలో పసిడిని ఒక పెట్టుబడి సాధనంగా చూస్తున్నారు. బంగారంలో ఇన్వెస్ట్ చేస్తే మంచి లాభాలు వస్తాయని, అత్యవసర సమయంలో ఆదుకుంటుందని ఎక్కువ మంది దీనిని ఎంచుకుంటున్నారు. దీంతో భారత్‌లో బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగుతుందని, పసిడి ధరలు మరింత పెరుగుతాయని ఓ నివేదిక తెలిపింది. 2025 చివరి నాటికి 10 గ్రాముల బంగారం రేటు రూ. 99,500 నుంచి రూ.110,000 మధ్య కదలాడుతుందని ఐసీఐసీఐ బ్యాంక్ ఎకనామిక్ రీసర్చ్ గ్రూప్ తెలిపింది. అదే 2026 మొదటి అర్ధ భాగం ముగిసే నాటికి తులం బంగారం రేటు రూ.1,25,000 స్థాయికి చేరుతుందని అంచనా వేస్తోంది. 'మన అంచనాల కంటే డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి చాలా తక్కువ స్థాయిలో ట్రేడవుతోంది. ఈ ఏడాది చివరి నాటికి రూపాయి విలువ రూ.87-89 మధ్య ఉంటుంది. గ్లోబల్ గోల్డ్ ధరలు ఈ 2025లో ఇప్పటి వరకు 33 శాతం మేర పెరిగాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలు, అమెరికా ఆర్థిక వ్యవస్థ క్షీణతపై ఆందోళనలు బంగారం ధరలు పెరిగేందుకు దోహదపడ్డాయి. 2025 చివరి నాటికి అంతర్జాతీయ బులియన్ మార్కెట్లో ఔన్స్ బంగారం ధర 3400- 3600 డాలర్ల మధ్య ఉండవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అది 2026 ఫస్ట్ హాఫ్ నాటికి 3600 నుంచి 3800 ఔన్స్ ధరకు చేరుకోవచ్చు. ' అని ఐసీఐసీఐ బ్యాంక్ ఎకనమిక్ రీసర్చ్ గ్రూప్ అంచనా వేసింది. ఒక వేళ ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక ఉద్రిక్తతలు పెరిగితే బంగారం



ధరలు మరింత పెరగవచ్చని తెలిపింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య యుద్ధ అనిశ్చితుల మధ్య బంగారం కొనుగోళ్లు తగ్గినప్పటికీ, బంగారం ర్యాలీ తదుపరి దశ అమెరికా పరిణామాలపై ఆధారపడి ఉంటుందని నివేదిక తెలిపింది. వీటిలో 2025-26లో ఫెడ్ రేటు తగ్గింపుల అంచనా వేసిన 125 బేసిస్ పాయింట్లు, యూఎస్ డాలర్ నుంచి కేంద్ర బ్యాంకులు, పెట్టుబడిదారుల్లో కొనసాగుతున్న వైవిధ్యీకరణ వంటివి ఉన్నాయని పేర్కొంది. ఇక దేశీయ మార్కెట్ విషయానికి వస్తే రుపాయి విలువ తగ్గడం, బంగారంలో పెట్టుబడులకు డిమాండ్ పెరగడం అనేది పసిడి ధరలు మరింత పెరిగేందుకు కారణమవుతున్నట్లుగా తెలిపింది. జూలై 2025లో భారతీయ దిగుమతులు 18 బిలియన్ డాలర్ల నుంచి 4 బిలియన్ డాలర్లకు పెరిగాయి. పండుగల సీజన్‌లో దేశీయ డిమాండ్‌ను ఇది సూచిస్తోందని తెలిపింది.

## రియల్-టైమ్ షాపింగ్ కోసం ఏఐ- పవర్డ్ లెన్స్ లైవ్‌ను లాంచ్ చేసిన అమెజాన్



ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ సరికొత్త ఫీచర్‌ను అందుబాటులో తీసుకొచ్చింది. దీని ద్వారా కస్టమర్లు మరింత సౌకర్యవంతంగా, సులభం గా షాపింగ్ చేసేందుకు వీలవుతుం దని అమెజాన్ చెబుతోంది.లెన్స్‌లైవ్ పేరుతో ప్రారంభించిన ఈ ఫీచర్ ద్వారా కస్టమర్లు తమ చుట్టూ ఉన్న వస్తువులను స్కాన్ చేసి అమెజాన్‌లో కొనుగోలు చేసే వీలుంటుంది. ఇది గూగుల్ లెన్స్ మాదిరిగానే ఉంటుంది. ప్రస్తుతానికి ఈ ఫీచర్‌ను అమెరికాలోని 10 లక్షలకు పైగా ఐఓఎస్ కస్టమర్లకు అనుమతిచ్చింది. త్వరలో అందరికీ అందుబాటులోకి వస్తుందని అమెజాన్ వెల్లడించింది. ఈ ఫీచర్‌ను ఉపయోగించి అమెజాన్ ద్వారా కెమెరా స్క్రీన్‌పై కనిపించే వస్తువులను స్కాన్ చేయవచ్చు. అనంతరం ఆ వస్తువుకు మ్యాచింగ్ ఉన్న ఉత్పత్తులను ఎంపిక చేసుకోవచ్చు. లెన్స్‌లైవ్ ద్వారా కెమెరాలో కనిపించే వస్తువుపై ట్యాప్ చేయడం ద్వారా ఫోకస్ అవుతుందని, దాన్ని షాపింగ్ బాస్కెట్‌లోకి సేవ్ చేసే ఆప్షన్లు కనిపిస్తాయి. ఈ ఫీచర్ అమెజాన్ తన ఏఐ అసిస్టెంట్ రుఫుసును కూడా వాడుకునే సౌకర్యం కల్పిస్తోంది. ఏదైనా ఉత్పత్తిని సెర్చ్ చేసే సమయంలో సమాచారం, ఇంటరాక్టివ్ కోసం ఇది పనిచేస్తుంది. అమెజాన్ వెబ్ సర్వీసెస్(ఏడబ్ల్యూఎస్) టెక్నాలజీ ఆధారంగా పనిచేయనుంది.

## ఊపందుకున్న భారత స్టాక్ మార్కెట్లు



బుధవారం భారత స్టాక్ మార్కెట్లు లాభాలతో ముగిశాయి, జీఎస్టీ కౌన్సిల్ సమావేశం ప్రారంభం కావడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ గణనీయంగా పెరిగింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 409.83 పాయింట్లు ఎగసి 80,567.71 వద్ద స్థిరపడగా, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 135.45 పాయింట్ల లాభంతో 24,715.05 వద్ద ముగిసింది. అనుకూలమైన విధాన నిర్ణయాలపై ఆశలు, ముఖ్య రంగాలను ఉత్తేజపరిచి, మొత్తం మార్కెట్ లాభాలకు దోహదపడ్డాయి. మెటల్ రంగ షేర్లు ఈ ర్యాలీకి నాయకత్వం వహించాయి, టాటా స్టీల్, హిందాల్కో, మరియు జేఎస్‌డబ్ల్యూ స్టీల్ వంటి కంపెనీలు నిఫ్టీలో అగ్రగామిగా నిలిచాయి. పారిశ్రామిక మరియు కమోడిటీ ఆధారిత రంగాలపై మార్కెట్ విశ్వాసాన్ని ఈ షేర్ల బలమైన ప్రదర్శన స్పష్టం చేసింది. జీఎస్టీ కౌన్సిల్ చర్చలు ఆర్థిక కార్యకలాపాలను మరింత ఉత్తేజపరిచే సంస్కరణలను తీసుకురావచ్చనే అంచనాలతో ఇన్వెస్టర్లు సానుకూలంగా స్పందించారు. అయితే, అన్ని షేర్లూ ఈ లాభాల్లో భాగం కాలేదు. ఇన్ఫోసిస్, నెస్లే, మరియు హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ షేర్లు నష్టాలను చవిచూశాయి, ఇది రంగ-నిర్దిష్ట సవాళ్లను లేదా ఇటీవలి ర్యాలీల తర్వాత లాభాల స్వీకరణను సూచిస్తుంది. అయినప్పటికీ, ఇతర బలమైన షేర్లలో గట్టి కొనుగోళ్లు మరియు సానుకూల అంతర్జాతీయ సంకేతాలతో మార్కెట్ తన ఊర్ధ్వ గతిని కొనసాగించింది. జీఎస్టీ కౌన్సిల్ సమావేశం కొనసాగుతున్నందున, ఆర్థిక వృద్ధిని మరింత పెంచే విధాన ప్రకటనలపై మార్కెట్ పాల్గొనేవారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మరియు దేశీయ ఆర్థిక సూచికలు సహాయకరంగా ఉంటే, ప్రస్తుత బుల్లిష్ సెంటిమెంట్ కొనసాగవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మార్కెట్ భవిష్యత్తు దిశను తెలుసుకోవడానికి ఇన్వెస్టర్లు ఈ సమావేశ ఫలితాలను దగ్గరగా పరిశీలిస్తారు.

# స్విగ్గీ ప్లాట్‌ఫాం ఫీ పెంపు

దేశీయ దిగ్గజ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలు తమ యూజర్లకు ఊహించని షాకులిస్తున్నాయి. జొమాటో ప్లాట్ ఫాం ఫీజు పెంచిన మరుసటి రోజునే స్విగ్గీ సైతం పెంపు ప్రకటన చేసింది. ఫుడ్ డెలివరీ బిజినెస్ ప్లాట్ ఫాం ఫీ పెంచుతున్నట్లు తాజాగా ప్రకటించింది. అంతేకాదు గడిచిన 15 రోజుల్లోనే రెండోసారి ఈ ప్లాట్ ఫామ్ ఫీజు పెంచడం ఆన్‌లైన్ ఫుడ్ లవర్స్‌కి ఊహించని షాక్ అని చెప్పవచ్చు. ప్రస్తుతం స్విగ్గీలో ప్లాట్ ఫాం ఫీజును రూ.15కు పెంచింది. అయితే ఎంపిక చేసిన మార్కెట్లకే ఈ పెంపు వర్తిస్తుందని తెలిపి స్వల్ప ఊరట కల్పించింది. ఆగస్టు 14, 2025 రోజునే ప్లాట్ ఫాం ఫీ రూ.12 నుంచి రూ.14కు పెంచిన సంగతి తెలిసిందే. పక్షం రోజుల్లోనే మరో రూ.1 పెంచడం గమనార్హం.ఫుడ్ డెలివరీ ఆర్డర్లపై స్విగ్గీ, జొమాటో వంటి ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్స్ ఈ ఛార్జీలను విధిస్తున్నాయి. ప్రస్తుతం సిగ్గీలో ఈ ఫీజు 15కు చేరింది. అయితే, ఇందులోనే వస్తు సేవల పన్ను జీఎస్టీ సైతం కలిసి ఉంటుంది. స్విగ్గీ ప్రత్యర్థి




సంస్థ అయిన జొమాటో సెప్టెంబర్ 2వ తేదీ మంగళవారం నుంచే ప్లాట్ ఫాం ఫీజును రూ.10 నుంచి రూ.12కు పెంచింది. ఈ పండుగల సీజన్‌లో డిమాండ్ ఉంటుందన్న అంచనాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇందులో జీఎస్టీ ఉండదని తెలిపింది. అంటే పన్నులు అదనంగా చెల్లించాల్సి వస్తుంది.దిగ్గజ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ తొలిసారి 2023, ఏప్రిల్ నెలలో ప్లాట్ ఫాం ఫీజు రూ.2 అమలులోకి తెచ్చింది. దానిని క్రమంగా రూ.12కు పెంచుతూ వచ్చింది. జొమాటో సైతం ఇదే విధానాన్ని అవలంభించింది. చివరి సారిగా జొమాటో 2024, అక్టోబర్‌లో మార్చింది. దాదాపు ఏడాది తర్వాత మళ్లీ ప్లాట్ ఫాం ఫీజులను జొమాటో సవరించింది. అయితే, స్విగ్గీ మాత్రం 15 రోజుల్లోనే మార్చుడం గమనార్హం. ఈ అగ్రిగేటర్ ప్లాట్‌ఫామ్స్‌లో సగటు ఆర్డర్ విలువ రూ.500-600 మధ్య ఉంటోంది. దీంతో పోలిస్తే ఈ ప్లాట్ ఫాం ఫీజు అనేది చాలా తక్కువగా విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, తాజా పెంపుపై స్విగ్గీ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. మరోవైపు.. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26 ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో కంపెనీ నెట్ లాస్ రూ.1197 కోట్లకు చేరింది. క్విక్ కామర్స్ బిజినెస్ ఇన్‌స్టా మార్ట్‌లో భారీగా పెట్టుబడులు పెట్టిన క్రమంలో కంపెనీ నష్టం రెండింతలైనట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలో ప్లాట్ ఫామ్ ఫీ పెంచినట్లు సమాచారం.

# సెంచరీతో కదం తొక్కిన రుతురాజ్ గైక్వాడ్

## స్పోర్ట్స్

వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌కు ముందు టీమిండియా యువ ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ జాతీయ సెలక్టర్లకు సవాలు విసిరాడు. బెంగళూరు వేదికగా సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ సెమీ-ఫైనల్ 2లో వెస్ట్‌జోన్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న రుతురాజ్.. అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు. శ్రేయస్ అయ్యర్, యశస్వి జైశ్వాల్ వంటి స్టార్ ప్లేయర్లు విఫలమైన చోట రుతురాజ్ సత్తాచాటాడు. ఆరంభంలోనే రెండు వికెట్లు కోల్పోయిన కష్టాల్లో పడిన తమ జట్టును రుతురాజ్ తన ఒంటరి పోరాటంతో ఆదుకున్నాడు. ఈ క్రమంలో సీఎస్‌కే కెప్టెన్ 131 బంతుల్లో 13 ఫోర్లతో తన సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఈ మహారాష్ట్ర ఆటగాడు 157 బంతుల్లో 120 పరుగులతో తన బ్యాటింగ్‌ను కొనసాగిస్తున్నాడు. 58 ఓవర్లు ముగిసే సరికి వెస్ట్ జోన్ 5 వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసింది. క్రీజులో రుతుతో పాటు తనీష్ కొటియన్(26) ఉన్నాడు.

### గైక్వాడ్ టెస్టుల్లో ఎంట్రీ ఇస్తాడా?

టీమిండియా తరపున వన్డే, టీ20ల్లో అరంగేట్రం చేసిన




రుతురాజ్ గైక్వాడ్ .. టెస్టు డెబ్యూ కోసం ఎదురు చూస్తున్నాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మంచి ట్రాక్ రికార్డు ఉన్నప్పటికి గైక్వాడ్‌కు ఒక్కసారి కూడా భారత టెస్టు జట్టులో చోటు దక్కలేదు. ఇప్పటిలో గైక్వాడ్ టెస్టుల్లో ఆడే సూచనలు కన్పించడం లేదు. ఎందుకంటే ఓపెనర్లగా కేఎల్ రాహుల్, యశస్వి జైశ్వాల్ తమ స్థానాలను సుస్థిరం చేసుకోగా.. మూడు, నాలుగు స్థానాలు ప్రస్తుతానికి ఖాళీ లేవు. మూడో స్థానంలో సాయిసుదర్శన్ వస్తుండగా.. నాలుగో ప్లేస్‌లో కెప్టెన్ శుబ్‌మన్ గిల్ బ్యాటింగ్ చేస్తున్నాడు. అయితే ఇంగ్లండ్ సిరీస్‌లో మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన సాయిసుదర్శన్, కరుణ్ నాయర్ ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయారు. ఒకవేళ ఆ స్థానాన్ని మరో ఆటగాడికి ఇవ్వాలని సెలక్టర్లు భావిస్తే రుతురాజ్‌కు భారత టెస్టు జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితులు బట్టి సెలక్టర్లు ఎటువంటి అనుహ్య నిర్ణయాలు తీసుకోపోవచ్చు. కాగా వెస్టిండీస్-భారత్ మధ్య రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆక్టోబర్ 2 నుంచి ప్రారంభం కానుంది.

## రెండోసారి ఆసియా కప్ బరిలో.. వసీం సారథిగా యూఏఈ స్క్వాడ్..!




ఆసియా కప్ కోసం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ బోర్డు పటిష్టమైన స్క్వాడ్‌ను ప్రకటించింది. ముహమ్మద్ వసీం సారథిగా 17 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేసింది. ముక్కోణపు సిరీస్‌కు తీసుకున్న క్రికెటర్లలో చాలామందికి మెగా టోర్నీ బెర్తు దక్కింది. అలానే సీనియర్లు మతిఉల్లాహ్ ఖాన్, లెఫ్టార్మ్ స్పిన్నర్ సిమర్జిత్ సింగ్‌లు స్క్వాడ్‌లో చోటు సంపాదించారు. వికెట్ కీపర్ ఆర్యన్ష్ శర్మకు బ్యాకప్‌గా రాహుల్ చోప్రాను తీసుకున్నారు సెలెక్టర్లు. యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ మొదలవ్వనుంది. సొంత గడ్డపై జరుగుతున్న ఈ మెగా టోర్నీలో ఆతిథ్య జట్టు గ్రూప్ ఏ లో ఉంది. లీగ్ దశ తొలిపోరులో భాగంగా సెప్టెంబర్ 10న భారత జట్టుతో ముహమ్మద్ వసీం సేన తలపడనుంది. సెప్టెంబర్ 15న ఒమన్‌ను, సెప్టెంబర్ 19న పాకిస్థాన్‌ను యూఈఏ ఢీకొట్టనుంది. ఈ ఏడాది మార్చిలో బంగ్లాదేశ్‌కు షాకిచ్చి పొట్టి సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకున్న వసీం బృందం స్వదేశంలో సంచలన విజయాలతో చెలరేగాలనే కసితో ఉంది. విధ్వంసక హిట్టర్ అయిన కెప్టెన్ వసీం, టాపార్డర్ రాణిస్తే ఈ పసికూన సూపర్ 4 కు చేరినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు అంటున్నారు విశ్లేషకులు.

యూఏఈ స్క్వాడ్ : ముహమ్మద్ వసీం(కెప్టెన్), అలీసాన్ షరాఫు, ఆర్యన్ష్ శర్మ(వికెట్ కీపర్), అసిఫ్ ఖాన్, ధ్రువ్ పరాషర్, ఎథాన్ డిసౌజా, హైదర్ అలీ, హర్షిత్ కౌశిక్, జునైద్ సిద్దిఖీ, మతిఉల్లాహ్ ఖాన్, ముహమ్మద్ ఫారూఖ్, ముహమ్మద్ జవదుల్లా, ముహమ్మద్ జొహైబ్, రాహుల్ చోప్రా (వికెట్ కపర్), రొషిద్ ఖాన్, సిమర్జిత్ సింగ్, సఘిర్ ఖాన్.

# మూడు ఫార్మాట్లకూ వీడ్కోలు పలికిన వెటరన్ స్పిన్నర్

భారత వెటరన్ స్పిన్నర్ అమిత్ మిశ్రా క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఒకానొక దశలో తన స్పిన్ మ్యాజిక్‌తో టీమిండియా ప్రధాన అస్త్రంగా మారిన మిశ్రా అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలుగుతున్నట్టు వెల్లడించాడు. 25 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు మంగళం పాడుతున్నట్టు గురువారం ప్రకటించాడీ స్పిన్ దిగ్గజం. అయితే.. ఇండియన్ ప్రీమియర్ లీగ్, దేశవాళీ క్రికెట్‌లో మాత్రం కొనసాగుతానని 42 ఏళ్ల మిశ్రా తెలిపాడు. 'అంతర్జాతీయ క్రికెట్‌లో 25 ఏళ్ల అనుభవం కలిగిన నేను ఈరోజుతో వీడ్కోలు పలకుతున్నాను. నా మొదటి ప్రేమ, తొలి గురువు, నాకెంతో సంతోషాన్నిచ్చే ఆటకు రిటైర్మెంట్ చెబుతున్నాను. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో భావోద్వేగాలు, గర్వపడిన క్షణాలు, బాధపడిన సందర్భాలు, నేర్చుకున్న విషయాలు చాలానే ఉన్నాయి. నాకు అవకాశం కల్పించినందుకు బీసీసీఐకి, హర్యానా క్రికెట్‌కు ధన్యవాదాలు. నాకు ప్రతి అడుగులో ఎంతగానో సహకరించిన కోచ్‌లు, సహాయక సిబ్బంది.. మరీ ముఖ్యంగా అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా' అని మిశ్రా పేర్కొన్నాడు. దేశవాళీలో అద్భుత ప్రదర్శనతో సెలెక్టర్ల దృష్టిలో పడిన మిశ్రా 2003లో తొలి వన్డే ఆడాడు. అయితే.. .. 2017లో చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. ఆ త ర్వాత నుంచి అవకాశాల కోసం ఎదురుచూసినా సెలెక్టర్ల నుంచి పిలుపు రాలేదు.




దాంతో.. ఐపీఎల్, దేశవాళీ క్రికెట్‌లో కనిపిస్తున్న మిశ్రా ఇక రిటైర్మెంట్ సమయం వచ్చేసిందని భావించాడు. సినీయర్లు అశ్విన్, ఛతేశ్వర్ పూజారాలు అన్ని ఫార్మట్ల నుంచి తప్పుకున్నందున తాను కూడా అల్విదా చెప్పాలని నిర్ణయించుకున్నాడు.భారత జట్టు తరపున 22 టెస్టులు, 36 వన్డేలు, 10 టీ20లు ఆడాడీ లెగ్ స్పిన్నర్. మూడు ఫార్మాట్లలో కలిపి 156 వికెట్లు పడగొట్టాడు. 2008లో టెస్టుల్లో అరంగేట్రం చేసిన మిశ్రా తొలి మ్యాచ్‌లోపే 5 వికెట్లతో మెరిశాడు.

### ఒకటి కాదు మూడు హ్యాట్రిక్స్

ఐపీఎల్ విషయానికొస్తే.. ఈ మెగా టోర్నీ ప్రధాన స్పిన్నర్లలో మిశ్రా ఒకడు. ఏకంగా మూడు హ్యాట్రిక్స్‌తో చరిత్ర సృష్టించాడు. ఢిల్లీ డేర్‌డెవిల్స్ తరఫున 2008లో, దక్కన్ ఛార్జర్స్ ప్లేయర్‌గా 2011లో, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడిగా 2013లో హ్యాట్రిక్ తీశాడు మిశ్రా. మిస్టరీ బౌలర్‌గా ముద్ర పడిన అతడు162 మ్యాచుల్లో 174 వికెట్లు తీసి అరదహో అనిపించాడు. 17వ సీజన్‌లో ఈ మిస్టరీ స్పిన్నర్ లక్నో సూపర్ జెయింట్స్‌కు

